విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

మంగళవారం 27 మే 2025 8 పేజీలు

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-మంగళగిరి : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలపై పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మంగళగిరి పట్టణంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ సీపీఐ కార్యాలయంలో ఏరియా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంకు సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య అధ్యక్షత వహించారు. ఈ సమావేశంకు ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ దేశంలో నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తరువాత ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలు ఎక్కువయ్యాయని ఆయన మండిపడ్డారు. సామాన్య ప్రజలు బతకలేని విధంగా వారిపై పెనుభారాలను మోపుతూ నిరంకుశ ధోరణితో వెళ్తున్నారని అన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యవసర సరుకుల ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తూ స్మార్ట్ మీటర్లు బిగించే నేపథ్యంలో ప్రజలపై మరో పెనుభారాన్ని మోపుతున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజల సొమ్మును మొత్తం పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ వారి సంపదను పెంపుదల చేస్తున్నాడని ఆయన ధ్వజమెత్తారు. దేశ ప్రజల పరిస్థితిని, ఆర్థిక స్థితిగతులను మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్పొరేట్ వ్యక్తులకు దోచిపెడుతూ తన సంపాదన పెంపుదల చేసుకుంటూ కార్మికులను, ఉద్యోగస్తులను ప్రజలను పాతాళానికి తొక్కేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్, పెట్టుబడిదారులకు దాసోహం అన్నట్లుగా ఉందన్నారు. కేంద్రంలో -మిగతా 2 లో ...

యువత పుస్తక పఠనం
అలవర్చుకోవాలి

- చిత్రకథలతో సృజనాత్మకత చాటిన విద్యార్థులు...
- బుక్ ఫెస్టివల్ కార్యదర్శి మనోహర్‌నాయుడు

విశాలాంధ్ర-విజయవాడ: ప్రస్తుత రోజుల్లో యువత ఫోన్‌లపై అధిక ఆసక్తి చూపుతున్నప్పటికీ పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానంతో పాటు కొత్త విషయాలు తెలుసుకోవడం ఉత్తమైనదని బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి మనోహర్‌నాయుడు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమవేదిక, స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక లైబ్రరీ వర్క్‌షాప్ సిరీస్‌లో భాగంగా సోమవారంతో ఏడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కామిక్ క్రియేషన్‌పై దృష్టి , విద్యార్థులు తమలో దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికితీయడంతో రెట్టింపు ఉత్సాహంతో సాగింది. ఈ సందర్భంగా మనోహర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు వివిధ కామిక్ పుస్తకాలను -మిగతా 2 లో ...

యోగాతో ఆరోగ్యం

విశాలాంధ్ర-విజయవాడ: యోగాతో మానసిక ఆరోగ్యంతో పాటు శరీర ధృడత్వాన్ని సొంతం చేసుకోవచ్చని వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తెలిపారు. సోమవారం విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆయుష్ శాఖ, ఎన్‌టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, వీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో థీమ్ యోగా కార్యక్రమ ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో కృష్ణబాబుతో పాటు కమిషనర్ జి.వీరపాండ్యన్, ఏపీఎంఎస్ఐడీసీ వీసీ, ఎండీ గిరీష పీఎస్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, -మిగతా 2 లో ...

కుట్రపూరిత చర్యలను ఐక్యంగా ఎదుర్కొందాం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ అంశంలో కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యలను ఐక్యంగా ఎదుర్కొవాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) జిల్లా కార్యదర్శి కూరపాటి కోటయ్యలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు -మిగతా 2 లో ...

సహకార బ్యాంకుల్లో
విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు ప్రథమ స్థానం

విశాలాంధ్ర-గన్నవరం : సహకారం బ్యాంకులలో దేశంలో విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు ప్రథమ స్థానంలో ఉందని బ్యాంకు డైరెక్టర్ జేవీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఆదివారం గన్నవరం కొత్తపేటలో రోటరీ ఆడిటోరియంలో విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు గన్నవరం వార్షిక మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ దేశంలో 1,850కి పైగా సహకార బ్యాంకులు పని చేస్తున్నాయని, దాదాపు 354 వరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ బ్యాంకులు ఎక్కువ శాతం రైతాంగానికి పంట రుణాలు ఇస్తున్నాయన్నారు. అయితే నేటి పాలకులు సహకార రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని, సహకార రంగంలో నాలుగు చట్టాలు తీసుకువచ్చారని విమర్శించారు. మొట్టమొదటగా దక్షిణ భారతదేశంలోనే కాంచీపురం సహకార బ్యాంకు స్థాపించడం జరిగిందన్నారు. అప్పటి నుంచి వివిధ రాష్ట్రాల్లో సహకార బ్యాంకులు పని చేస్తున్నాయని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రైవేట్ రంగంలో కొన్ని బ్యాంకులు స్వార్థపూరిత విధానాలతో పని చేశాయని, 1949లో బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. అటుతర్వాత 1966లో బ్యాంకింగ్ చట్టానికి సవరణ తీసుకువచ్చి రిజర్వు బ్యాంకు పర్యవేక్షణలో సహకార బ్యాంకుల కార్యకలాపాలు

సంబంధించి అర్బన్ బ్యాంకులో దేశంలో పనిచేస్తుందని అన్నారు. కోవిడ్ కష్టకాలంలో ఒక విధానం ఉన్నప్పుడు పార్లమెంటు కూడా సమావేశం కాలంలో మరొకసారీ చట్టం తీసుకొచ్చి అర్బన్ బ్యాంకుల మీద ఆర్బిఐ యొక్క పర్యవేక్షణ బ్యాంకు వ్యవస్థను దేశంలో అధికారం సాగిస్తుందన్నారు. ప్రపంచంలో సృష్టించబడుతున్నటువంటి సంపదల్లో ఎక్కువ భాగం పదిమంది చేతుల్లో ఉంటుందని మిగిలిన 10 శాతం 99 మంది జనాభాకు అందుతుందన్నారు. దేశంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడ బోతుందని ఆర్థిక నిపుణులు తెలిపారన్నారు సహకార రంగంపై చాలా దేశాలు ఆధారపడి -మిగతా 2 లో ...

సమస్యలు పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలీ శర్మ, డీఆర్ఓ కే. చంద్రశేఖరరావు, ఆర్ఆర్‌సిఎస్‌డిసి శ్రీదేవి, ఆర్డీఓ కే. స్వాతి కలిసి 'మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ ప్రజల సమస్యలను విని సంబందిత అధికారులను పిలిపించి సమస్యలను వీలైనంత వరకు సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఈ క్రమంలో మొత్తం 145 అర్జీలను స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటా మని తెలిపారు. ఉంగుటూరు మండలం ఇందుపల్లి గ్రామానికి చెందిన ఇందుపల్లి యోహానం ఉపాది పనుల్లో అవకతవకలు జరిగాయని, గ్రామంలో లేని వారి పేర్లు, పనిచేయని వారి పేర్లు జతచేసి 200 జాబ్ కార్డులు అక్రమంగా జారీ చేసారని, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, ఈ విషయమై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. లక్ష్మీపురం గ్రామ కాపురస్తురాలు తన భూమికి నోటిఫికేషన్ సమయంలో ఉన్న మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం -మిగతా 2 లో ...

అలవర్చుకోవాలి (మొదటిపేజీ తరువాయి)

అధ్యాయనం చేసి, కామిక్స్ ఎలా రూపొందిస్తారు అనే దశలను గుర్తించారు. ఇచ్చిన థీమ్ ప్రకారం వారి స్వంత కామిక్ కథనాలను రూపొందించుకున్నారు. ఈ కార్యాచరణ ద్వారా విద్యార్థులు కళాత్మకత, క్రియేటివ్ రచనా నైపుణ్యాలను ప్రదర్శించారని తెలిపారు. ఇలాంటి వర్క్‌షాప్‌లలో పాల్గొనాలనుకునే విద్యార్థులు స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమవేదిక లేదా విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీను సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం జేపీ పబ్లికేషన్స్ అధినేత జేపీ ప్రసాద్, హాన్స్ ఇండియా సర్క్యులేషన్ మేనేజర్ సుబ్బారావు మాట్లాడుతూ పుస్తకాల ద్వారా మానసిక, సామాజిక వికాసాన్ని సాధించడానికి ఇటువంటి కార్యక్రమాలు ముఖ్యమని వివరించారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీస్తూ, వారి మనస్సులను విజ్ఞానం వైపు మళ్లిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాపులో అత్యుత్తమమైన కామిక్ క్రియేషన్సను రూపొందించిన విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి, అతిథులు పుస్తకాలను బహుమతులుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పునర్వికాస ఉద్యమవేదిక ప్రతినిధి గోళ్ల నారాయణ రావు, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు లక్ష్మయ్య, స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు హసీనా మరియు నిహారికా పాల్గొన్నారు.

పోరాడాలి (మొదటిపేజీ తరువాయి)

మోదీ అధికారం చేపట్టిన తర్వాత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలం చెందారన్నారు. ముఖ్యంగా రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పెట్టుబడిదారులు కార్పొరేట్ వ్యవస్థలకు వత్తాసు పలుకుతూ వారి సంపదను పెంచుతూ రైతు, కార్మికుల శ్రమలను దోచుకుం టున్నారని మండిపడ్డారు. పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి రక్త తర్పణాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కులను హరిస్తున్నారని మండిపడ్డారు. మంగళగిరి పట్టణ మహాసభ జులై 6న, మంగళగిరి మండల మహాసభ జులై 12న, తాడేపల్లి ప్రాంత సమావేశం జులై 20న, మంగళగిరి నియోజకవర్గ మహాసభ జులై 27న జరగనున్నాయని, మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి ముసునూరి సుహాస్, ఏఐటీయూసీ నియోజకవర్గ సహాయ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, బత్తుని మోహనరావు, గోహర్ జానీ తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ స్థానం (మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయన్నారు. జోనల్ మేనేజర్ ఎస్ ఎస్ ఆర్ మూర్తి మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు ఆరోగ్య బీమా సదుపాయం మా బ్యాంక్ కల్పించిందని ఖాతాదారుల సేవలు మరింతగా చేరువ చేస్తున్నామని తెలిపారు. ఖాతాదారుల పిల్లల్లో చదువు ఉన్నత చదువులకు రుణాలు ఇస్తున్నామని, ఖాతాదారుల పిల్లల్లో మెరిట్ సాధించిన వారికి నగదు బహుమతి ఇస్తున్నామన్నారు. లాకర్ సౌకర్యాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకులో రుణం తీసుకున్న వారు సక్రమంగా చెల్లించినట్లయితే వడ్డీలో నాలుగు శాతం రాయితీ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ బ్యాంక్ డైరెక్టర్లు చిన్నం కోటేశ్వరరావు, గన్నవరం బ్రాంచ్ ఇంఛార్జ్ డైరెక్టర్లు పొట్లూరి వెంకటరమణరావు, ముక్కపల్లి రామారావు, బ్యాంకు మేనేజర్ సీహెచ్‌వీ రామశాస్త్రి, ఖాతాదారులు పాల్గొన్నారు.

మానస్ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ పాతబస్తీ గొల్లపాలెంగట్టు ప్రాంతానికి చెందిన తమ్మ మానస్(8) ఆదివారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలటంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందడం జరిగింది. విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచిన బాలుడి మృతదేహాన్ని సోమవారం సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి వీరభద్రరావు, నగర నాయకులు తాడి పైడయ్య, మూలి సాంబశివరావు, స్థానిక పార్టీ నాయకులు మోకా దుర్గారావు, కంచర్ల భార్గవ్, లంకె సాయి మృతదేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు అధికారులతో మాట్లాడుతూ నిరుపేదలు అయినా బాలుడి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రతి ఫిర్యాదులు శాశ్వతంగా పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఫిర్యాదును శాశ్వతంగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ చంద్రశేఖర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను వీఎంసీ అదనపు కమిషనర్ నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుదారుని ఫిర్యాదును సంబంధిత అధికారులు స్వయంగా వచ్చి పరిశీలించి సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాన్ని చూపాలని ఆదేశించారు. చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి ఇన్‌చార్జి సీఎంవోహెచ్ డాక్టర్ గోపాల కృష్ణ నాయక్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐక్యంగా ఎదుర్కొందాం (మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నాయని, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తామని మాయమాటలు చెబుతూ ప్రైవేటీకరణ దిశగా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయన్నారు. సుమారు 4 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి తొలగించి, మరొక్క 2,500 మంది కార్మికులను తొలగించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. సుమారు 1,200 మంది పర్మనెంట్ కార్మికులను బలవంతంగా వీఆర్ఎస్ తీసుకునే విధంగా ఒత్తిడి తీసుకువస్తున్నాయని, ఈ విధమైన మోసపూరిత చర్యలను తక్షణమే ఆపివేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం యువకులు, విద్యార్థులు ప్రాణత్యాగాలతో ఏర్పడిందని, నేడు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించడం కోసం మరొక్కసారి నాటి పోరాటం, త్యాగం అవసరమని అంతటి పట్టుదలతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించి విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవాలని వారు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వుప్పాల సత్యనారాయణ, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ మాట్లాడుతూ నేడు అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షిస్తామని, ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ చేయబోమని ఎన్నికల హామీలలో చేర్చి, ప్రచారం నిర్వహించి పెద్దఎత్తున ప్రజల ఓట్లను వేయించుకుని అధికారం చేపట్టారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత చెప్పిన మాటలకు చేస్తున్న చేతలకు సంబంధం లేకుండా పోయిందని వారన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, ఆటో సంఘం నగర కార్యదర్శి మంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా బైకు జాతాలు నిర్వహించామని, అనేక పోరాటాలు చేసామని, ఈ కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగిస్తామని ప్రకటన చేసేంతవరకు పెద్దఎత్తున పోరాటాలను చేయడానికి సిద్ధమవుతున్నామని తెలిపారు. ఉక్కు కర్మాగార ఏర్పాటులో అమరులైన విద్యార్థి, యువజనుల త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని మరొక్కసారి పోరాటాలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. అనంతరం ర్యాలీగా వెళ్లి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు కూరాకుల రాంప్రసాద్, ఉపాధ్యక్షులు బాబర్, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విట్టల్ రెడ్డి, జగన్నాథం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతూ ఈశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కోశాధికారి కోటి వీరాంజనేయులు, తిరుమల, కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కాయల రామారావు, దేగల వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బొట్టు శ్రీనివాసు, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి బన్నీ, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చల్లా మరియదాసు, అరుణ్ కుమార్, సీఐటీయూ నగర కార్యదర్శి శ్రీనివాసు, ముత్యాలరావు, నిక్సన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-విజయవాడ: నగరంలోని సూర్యారావుపేట జూబ్లీ ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మత్తులు, సర్దుబాటు కారణంగా మంగళవారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బి వెంకట్రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ గెస్ట్ హౌస్, గోపాలరెడ్డి రోడ్డు, ప్రకాశంరోడ్డు, దొర్నకల్ రోడ్డు, నరసింహారావు నాయుడు వీధి, కాళేశ్వరావు రోడ్, వెంకటరత్నం వీధి, గోవిందరాజులు నాయుడు వీధి, తాడేపల్లి వారి వీధి, పీసపాటి వారి వీధి, టొబాకో బ్యారెన్ స్ట్రీట్, డాక్టర్ యన్.సుబ్బారావు వీధి, దాసరి వారి వీధి, సూర్యనారాయణ వీధి, వేమూరి వారి వీధి, జడగం వారి వీధి మొదలగు ఏరియాలలో విద్యుత్ సరఫరా ఆపడం జరుగుతోందని సహకరించాలని కోరారు.

యోగాతో ఆరోగ్యం (మొదటిపేజీ తరువాయి)

ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్, పెద్దఎత్తున యోగా ఔత్సాహికులు, నగర ప్రజలు పాల్గొని డా. రత్న ప్రియదర్శిని మార్గనిర్దేశనంతో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ మే 21న ప్రారంభమైన యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల్లో 26 రోజుల పాటు 26 ఇతివృత్తాలతో థీమ్ యోగా కార్యక్రమాలు ప్రారంభమైనట్లు వివరించారు. రైతులు, కార్మికులు, ఉపాధి హామీ శ్రామికులు, సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులు.. ఇలా సమాజంలోని ప్రతి వర్గానికి యోగాను చేరువచేసేందుకే ఈ థీమ్ యోగా ను నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 104 పర్యాటక ప్రాంతాల్లోనూ యోగా విశిష్టతను వివరించి, అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో దాదాపు 15 లక్షల మందికి యోగాను నేర్పే లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయానికి ఏడుగురు చొప్పున దాదాపు దాదాపు అయిదువేల మంది ట్రైనర్లతో ప్రజలకు యోగాసనాలు నేర్పించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. యోగా ప్రయోజనాలపై ప్రతిఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామని, ప్రజలు తమ జీవనశైలిలో యోగాను భాగం చేసుకొని జీవితాంతం అభ్యసించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. భారతీయ వారసత్వ సంపద అయిన యోగాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషిచేస్తున్నట్లు ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. యోగాభ్యాసనతో శారీరక, మానసిక ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడంతో పాటు అభ్యసన చేయించడం జరుగు తోందన్నారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్, జిల్లా ఆయుష్ యోగాంధ్ర నోడల్ అధికారి డా. వి.రాణి, జిల్లా ఆయుష్ శాఖ అధికారి డా. రామలక్ష్మి, మెడికల్ ఆఫీసర్ డా. వై.రత్న ప్రియదర్శిని, యోగాంధ్ర నోడల్ అధికారులు డా. ఎం.సుహాసిని, డా. జె.సుమన్, యోగా ట్రైనర్లు సత్యనారాయణ, రామాంజనేయులు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా. రమేష్ కొల్లేటి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అమరావతి యోగా అసోసియేషన్, పతంజలి యోగా, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, బ్రహ్మకుమారీలు భాగస్వాములయ్యారు.

ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ పోయినది

ఎన్.టి.ఆర్. జిల్లా గంపలగూడెం మండలం నత్యాలపాడు గ్రామం కాపురస్తులైన **నల్లగొర్ల స్వాతి, తండ్రి కొండలరావు** అను నాకు సంబంధించిన ఇంటర్మీడియట్ బోర్డువారు మంజూరు చేసిన ఒరిజినల్ మార్కులలిస్టు పోయినది. సర్టిఫికెట్ నెం. ఇ411292, రి.నెం. 9261393రు ది. 19-04-2025నాడు మా ఇంటినుండి జిరాక్స్ నిమిత్తం బైక్‌పై వెళుతుండగా పోయినది. సర్టిఫికెట్ ఎవరికైనా దొరికినచో పై అడ్రస్సుకు తెలుపగలరు.

పరిష్కరించాలి (మొదటిపేజీ తరువాయి)

ఇవ్వవలసినదిగా కోరుతూ అర్జీ అందజేశారు. దోకిపర్రు గ్రామానికి చెందిన ఫజుల్లున్నీసా మహమ్మద్ తనకు ఆరోగ్యం బాగోలేదని, తన ఖాతా నెంబరు 631ను సరిచేసి కొత్త పట్టాదారు పాస్‌బుక్ ఇవ్వాలని కోరుతూ అర్జీ అందజేశారు. సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ సిఐటియు మచిలీపట్నం కమిటీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణ ఆపాలని, విధుల నుండి తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి మరల తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 23,117 అర్జీలు అందగా 21,269 అర్జీలు పరిష్కరించామని, మిగిలిన 1848 అర్జీలు సత్వరమే పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ మీకోసం అర్జీల పరిష్కారంపై ప్రజల్లో సంతృప్తి లేదని, జిల్లాలో మంచి అభిప్రాయం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి సంబందించి ఎండార్స్‌మెంట్లు సంతకాలు చేయించుకొని సంబంధిత అర్జీదారులకు పంపడం లేదని అందువలన ప్రజల్లో అసంతృప్తి కలుగు తోందని, అధికారులు సంబంధిత అర్జీదారులకు తెలుగులో సమాధానం పంపాలని, ఇకపై అర్జీదారులతో మాట్లాడే ఉద్యోగులు వారికి సావధానంగా సమాధానం ఇవ్వాలని, దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమం ప్రతిష్ఠాత్మకమైనదని, ప్రతి ఉద్యోగి తన పేరును నమోదు చేసుకోవాలని, పట్టణస్థాయిలో మున్సిపల్ కమిషనర్, మండల స్థాయిలో ఎంపీడీఓ పట్ట, మండల స్థాయి కమిటీలకు చైర్మన్‌గా వ్యవహరిస్తారని, సంయుక్త కలెక్టర్ నోడల్ అధికారిగా జారీ చేసే సూచనలు, సలహాలు పాటించాలని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 27 మంగళవారం ఉదయం 7 గంటలకు మచిలీపట్నంలో జెడ్పీ కన్వెన్షన్ హాల్ నుండి సాయిబాబా దేవాలయం వరకు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహిస్తామన్నారు. జిల్లా అధికారులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ మాట్లాడుతూ ఐ గాట్ కర్మయోగి ఆన్లైన్ శిక్షణ తరగతులను డిఈఓ, డిపిఓ, పోలీస్ శాఖలు పూర్తి చేయాలని యోగాపై రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఆనంద్ కుమార్, డ్వామా, డిఆర్‌డిఏ, మెప్మా, పిడిలు శివప్రసాద్, హరిహరనాథ్, సాయిబాబు, పంచాయితీ రాజ్ ఎస్ఈ రమణారావు, ఆర్డబ్ల్యూఎస్, రహదారులు, భవనాల ఈఈలు నటరాజు, లోకేష్, డీఎస్ఓ పార్వతి పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడుల్లో ముగ్గురు అరెస్టు

విశాలాంధ్ర, విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట, తిరువూరు మండలాల్లో సోమవారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు తిరువూరు ఎక్సైజు సీఐ ఎన్.నిక్సన్ తెలిపారు. విస్సన్నపేట మండలం చంద్రుపట్ల తండా శివారు కొర్రతండా గ్రామంలో నాటు సారా తయారీ కోసం నిల్వ ఉంచిన సుమారు 50లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, ఈ కేసులో నిందితుడు కొర్ర నాగేశ్వరరావును అరెస్టు చేశామన్నారు. తిరువూరు రాజుపేటలో మద్యం బెల్టు విక్రయాలు చేస్తున్న తోట హరీష్, ముప్పా సాంబశివరావులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 26 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. ఈ దాడుల్లో సీఐ నిక్సన్‌తోపాటు ఎక్సైజు ఎస్ఐలు సిహెచ్.వెంకటకుమార్, వి.కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సమైక్యతను రక్షించుకుందాం

విశాలాంధ్ర - గుడివాడ : దేశ సమైక్యతను రక్షించు కునుదేకు ప్రతి ఒక్కరు మతంతో యుద్ధల పేరుతో మోసలు చేస్తున్న బీజేపీని వ్యతిరేకించాలని సీపీయం రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక సీపీయం కార్యాలయంలో సమైక్యత సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర సీపీయం నాయకులు హరిబాబు మాట్లాడుతూ గత 11 సంవత్సరాల బీజేపీ పాలనలో దేశం అన్ని రంగాలను నిర్వీరుగారిపోయిలే చేసిందరన్నారు. దేశంలో ప్రజల మధ్య మతం పేరుతో చిచ్చు పెట్టి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. పహల్గాం దుర్ఘటనకు మతం రంగు పులమటం దుర్మార్గమన్నారు. పాకిస్థాన్, భారత్ యుద్ధాన్ని తానే నివారించానని, ఇరుదేశాల సరిహద్దు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటిస్తే మోదీ నోరుమెదిపే సాహసం చేయలేదన్నారు. మోదీ నిరంకుశ విధానాలను దేశంలోని లౌకిక ప్రజాతంత్ర వాదులంతా ఐక్యంగా ప్రతిఘటించి దేశసమైక్యతను, సమగ్రతను కాపాడు కోవాలని పిలుపిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి, ఐద్వా కృష్ణాజిల్లా ఉపాధ్యక్షురాలు పి.రజని, పట్టణ కమిటీ సభ్యులు శివానాగమల్లేశ్వరరావు, సభ్యులు, లంకా సురేంద్ర, తాజుద్దీన్, లౌకిక వాదులు పాల్గొన్నారు.

యోగా దివస్‌కు సహకరించండి

విశాలాంధ్ర, ఉయ్యూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగా దినోత్సవ ప్రజా భాగస్వామ్యాన్ని పెంచేందుకు ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జీఎస్వి శేషగిరిరావు కోరారు. సోమ వారం మండల యోగ కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి అందర్నీ సమావేశం చేయడంలో భాగంగా ముందుగా గ్రామ కార్యదర్శిలకు, సచివాలయ సిబ్బందికి, అంగన్వాడీ సిబ్బందికి, ఉపాధి కార్మికులకు, వివిధ స్థాయిల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 28న ఉయ్యూరులో యోగా అవగాహన ర్యాలీని భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. జూన్ 2న యోగపై వ్యాసరచన సూర్య నమస్కార సాధన చిత్రలేఖనం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఇందులో పాల్గొని విజేతలుగా నిలిచిన వారికి జ్ఞాపికలు ప్రశంసా పత్రాలు అందించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సురేష్, ఈవోపీఆర్డి, పోలీస్ అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికారి, పాల్గొన్నారు.

విత్తన షాపులు తనిఖీ

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : పట్టణంలోని పలు విత్తనాల షాపులను జగ్గయ్యపేట ఏ డి ఏ భవాని ఆధ్వర్యంలో అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. విత్తన షాపు లైసెన్స్, బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్లు, పీసీలు ఇన్వాయిసులు తనిఖీ చేశారు. పత్తి విత్తనాల ధర ఎంఆర్పీ రూ.901గా నిర్ణయించారు. విత్తనాలు ఎంఆర్పీ ధరలకు అమ్మాలని ఆయా షాపుల యజమానులకు సూచించారు. రైతులు విత్తనాలు తీసుకునేటప్పుడు బిల్స్ జాగ్రత్తగా భద్రపరచు కోవాల్సిందిగా తెలియజేశారు. జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్‌లోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ లో రైతులకు ఉచితంగా విత్తన పరీక్షలు చేస్తారన్నారు. ఏఓ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్యం, విద్యకు పెద్దపీట: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కూచిపూడి : ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు హయాంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరమైన వైద్య విద్యపై ప్రత్యేక దృష్టిసారించి వాటి అభివృద్ధికి బాటలు వేస్తోందని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రు నియోజకవర్గంలోని మొవ్వప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించిన 'బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌'ను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసిసోమవారం ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ దీనివల్ల రోగులు నిర్వహించుకోవలసిన వైద్య పరీక్షలకు దూరప్రాంతాలైన మచిలీపట్నం ఉయ్యూరు విజయవాడలలోని హాస్పిటల్స్‌కి వెళ్లాల్సిన అవసరం లేదని, ఈ హెల్త్ యూనిట్లో వైద్యపరీక్షలకు పక్క మండలాల నుంచి రోగులు వచ్చి పరీక్షలు చేయించుకోవచ్చునన్నారు. అవసరమైతే దీన్ని అప్‌గ్రేడ్ చేయడానికి కూడా తగుచర్యలుతీసుకొంటానని హామీ ఇచ్చారు. ఈ హెల్త్ యూనిట్ నిర్మించడానికిస్థలాన్ని వైద్యాలయంకు అందించిన మాజీ మనసబు మండవ వాసుదేవరావు దాతృత్వాన్నిసభా ముఖంగా అభినందించారు. పామర్రు నియోజకవర్గంలోని తోట్లవల్లూరు మండలంలో ప్రయోగశాల నిర్మిస్తున్నామని త్వరలో దానిని కూడాప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, ఎంపీపీ కొండేటి ఇందిర, జ.డ్పి.టి.సి రాజులపాటి పార్వతి, మాజీ ఎంపీపీ కిల్లర్ మంగమ్మ, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు, ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, పీహెచ్.సి వైద్యాధికారిణి, డాక్టర్ సిహెచ్ రాజేశ్వరి, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఎం విఆర్ కెఎస్ భగవాన్, సి హెచ్ఓడి శంకరరావు, ఎంపీడీవో జే విమాదేవి, తహసీల్దార్ కే మస్తాన్, పి హెచ్ఎన్. డి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

3 నుంచి నవగ్రహ మండపం పునఃప్రతిష్ట మహోత్సవం

విశాలాంధ్ర-విజయవాడ (ఇంద్రకీలాద్రి) : ఇంద్రకీలాద్రి కొలువైన శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన నవగ్రహ మండపం పునఃప్రతిష్ట కార్యక్రమం జూన్ 3 నుంచి 5 వరకు జరుగుతోందని ఆలయ ఈవో వీకే.శీనానాయ్ అన్నారు. సోమవారం ఇంద్రకీలాద్రిపై ఉన్న మహామండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనకదుర్గ అమ్మవారి నైవేద్యం విరామం కోసం ఇకపై ప్రతి రోజు 11:30గంటల నుండి 1:30గంటల వరకు వీఐపీ దర్శనాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. దుర్గగుడిలో అమ్మవారికి నైవేద్యాలను సమర్పించే సమయంలో క్యూలైన్లను ఎక్కడికక్కడే నిలిపి వేస్తుండటంతో వృద్ధులు, వికలాంగులు, పసి పిల్లలు తీవ్రంగా ఇబ్బంది పడు తున్నారని అదే సమయంలో వీఐపీ దర్శనాల కోసం వస్తుండటంతో సామాన్య భక్తులు ఇబ్బంది పడుతుం డటంతో దర్శనాలను క్రమబద్ధీకరిస్తున్నట్లు తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే వీఐపీలు ముందస్తు సమాచారం ప్రోటోకాల్ విభాగానికి అందించాలని, అన్ని వివరాలతో కూడిన ఫార్మాట్‌లో వివరాలు తెలియ చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న అన్నదాన భవనం, లడ్డు తయారీ భవనం దసరా నాటికి వినియోగంలోకి తీసుకువచ్చేలా యుద్ధప్రాతికదికన పనులు జరుపుతున్నట్లు వివరిం చారు. రాతి యాగశాల, పూజా మండపములు శ్రావణ మాసంలోగా అందుబాటులోకి తీసుకురానున్నారు. నగరంలో నుండి ఇంద్రకీలాద్రి వచ్చే భక్తుల సౌకర్యార్థం బస్టాండ్, రైల్వే స్టేషన్, పున్నమి ఘాట్ నుండి బస్సులు ఏర్పాటు చేసి, కొండపైన ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పరిష్కారం చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. వాహనాల మీద వచ్చే వారు సీతమ్మ వారి పాదాలు ప్రాంతంలో పార్కింగ్‌కు 4 ఎకరాల్లో హోల్డింగ్ ఏరియా సిద్ధం చేస్తున్నామని, అవసరమైతే కుమ్మరిపాలెం సెంటర్‌లో టీటీడీ స్థలంలో హోల్డింగ్ ఏరియా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దుర్గాఘాట్ ను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుం టున్నామన్నారు. ప్రసాద్ పథకం ద్వారా కేంద్రం సహాయంతో ఆలయాలను అభివృద్ధి చేయడానికి దేవాదాయ ధర్మదాయశాఖ మంత్రి, విజయవాడ పార్లమెంట్ సభ్యులు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన తాళ అధ్యయన తరగతులు

విశాలాంధ్ర -విజయవాడ కల్చరల్ : శ్రీ నటరాజ రామకృష్ణ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు బాలోత్సవ్ భవన్‌లో శాస్త్రీయ యువ నాట్యాచార్యులకు జరిగిన తాళ అధ్యయన తరగతులు సోమ వారంతో ముగిశాయి. ప్రసిద్ధ ఆంధ్ర నాట్యాచార్యులు పిళ్ళా ఉమామహేశ్వర పాత్రుడు నాట్యానికి లయ ఎంత ప్రధానమో తెలుపుతూ నాట్యంలోని జతులకు తాళం ఎలా వేయాలో ప్రాథమిక దశలో తెలుసుకుని సాధన చేస్తేనే నట్టువాంగం వేసేప్పుడు అంత విన్యాసంగా నడిచే జతిని లయబద్ధంగా సులువుగా అనగలమని అభ్యాసకులకు తెలిపారు. మృదంగ విద్వాంసులు అమ్ముల ఎస్ ప్రసాద్ విద్యార్థుల చేత ఐదు జాతులలో, ఐదు గతులలో సప్త తాళాలు ఏ విధంగా రూపాంతరం చెందుతాయి, అలా రూపాంతరం చెందిన ఒక్కొక్క తాళం ఆవృత్తమునకు ఎన్ని అక్షరములు, వాటిలో మనం అనవలసిన శబ్దాన్ని లయబద్ధంగా ఎలా అనాలి అనేవి తెలుపుతూ నాట్యా భ్యాసకుల చేత అని పించి తాళం వేసే విధానంపై వారిలో అనురక్తిని పెంచి, స్వంతంగా కొత్త జతులు చేసుకునే విధానాన్ని తెలిపారు. బాలోత్సవ్ భవన్ ప్రతినిధి తులసిరావు, పర్యవేక్షకులు గుండు నారాయణ తదితరులు నాట్యా చార్యులు ఉమామహేశ్వర పాత్రుని, అమ్ముల ఎస్ ప్రసాదును సత్కరించి గౌరవించారు. అనంతరం వారు మాట్లాడుతూ కళలు మానసిక వికా సాన్ని కలిగిస్తాయ న్నారు. కళలు పునర్వైభవాన్ని పొం దటానికి తమ వంతు సహకారం ఎప్పుడూ అందిస్తామని, నేటి యువత కళలలో దేశ కీర్తిని ఇనుమడింపచేసే గొప్పవారు కావాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

విశాలాంధ్ర- కంచికచర్ల: వాహన దారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు అని కంచికచర్ల పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్సై బి. రాజు తెలిపారు. మండల పరిధిలోని స్థానిక కంచికచర్ల లోని పలు సెంటర్ లలో సోమవారం వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా ట్రాక్టర్లు వాహన డ్రైవర్లు, లౌడ్ స్పీకర్‌తో ప్రయాణిస్తున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నా డ్రైవర్ల తీరు మారడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆటోలు డ్రైవర్లు పరి మితికి మించి ప్రయా ణికులు ఎక్కించుకోకుండా ఉండాలని తెలియజేశారు. ద్విచక్ర వాహనాలపై వాహనదారులు ప్రయాణించే టప్పుడు హెల్మెట్, వాహనానికి సంబంధించిన సరియైన పత్రాలు కలిగి ఉండాలి , వాహనదారులు ట్రిబుల్ రైడింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు కలెక్టర్ బరోసా

ఉచితంగా ట్రై సైకిళ్లు అందజేత..

విశాలాంధ్ర-విజయవాడ: దివ్యాంగుల ఆవేదనను ఆలకించి ఆపై సత్వరమే స్పందించిన కలెక్టర్ లక్ష్మీశ ఉచితంగా మూడు చక్రాల సైకిలును అందజేశారు. దీంతో జీవిత మార్గానికి బాటవేసిన కలెక్టర్‌కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు. దివ్యాంగుల అర్హతలను పరిశీలించి మూడు చక్రాల సైకిళ్లను సమకూర్చడంపై జిల్లా రెవెన్యూ అధికారి దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల సహాయంతో సోమవారం కలెక్టరేట్‌లో ఇద్దరు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందించారు. అతి తక్కువ సమయంలో తమకు ఉచితంగా వాహనాలు అందజేయడంపై లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

పీజీఆర్ఎస్ ద్వారా 167 అర్జీల స్వీకరణ..

సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా 167 అర్జీలు స్వీకరించినట్లు డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తెలిపారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 65, పోలీస్ 30, ఎంఏయుడి 14, పంచాయతీరాజ్ 6, సర్వే 4, డిఆర్‌డిఏ 5, వైద్య ఆరోగ్యం 2, హౌసింగ్ 8, ఏపీసీపీడీసీఎల్ 2, డ్వామా 2 , జలవనరులు 2, బీసీ కార్పొరేషన్‌కు 7, ఎస్‌సీ కార్పొరేషన్ 1, వ్యవసాయం 2, గ్రామ, వార్డు సచివాలయాలు 3, ఉపాధి కల్పన 1, మార్కెటింగ్ 2, ఆర్‌డబ్ల్యూఎస్ 1, ఆర్ అండ్ బీ 3, నైపుణ్యాభివృద్ధి 1, సాంకేతిక విద్య 1, విభిన్న ప్రతిభావంతులు 1, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ 3, బ్యాంకింగ్ 1 అర్జీలు ఉన్నాయన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ఆయా జిల్లా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నూతన భవనంలోకి అనుమతి ఇవ్వాలని వినతి

విశాలాంధ్ర-తిరువూరు: మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గానుగపాడు తరగతులు ప్రస్తుతం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోనే నిర్వహించడం జరుగుతుందని, దాతలు ఇచ్చిన స్థలంలో నూతన భవన నిర్మాణం పూర్తి అయిందని, ప్రాథమిక పాఠశాల ఆదర్శ ప్రాథమిక పాఠశాలగా మారినందున, ఈ విద్యా సంవత్సరం నుంచి హై స్కూల్ తరగతులని నూతన భవనంలో నిర్వహించడానికి, పరిశీలించి తగిన అనుమతులు మంజూరు చేయాలని పాఠ శాల తల్లి దండ్రుల సభ్యులు కె. సత్యం, టి. జమలయ్య, కె. చిన వెంకటరత్నం, పాఠశాల ఉపాధ్యాయుడు యం. రాం ప్రదీప్ సోమవారం ఎంపీడీవో సి హెచ్. రవి బాబు, మండల డిప్యూటీ తహసీల్దార్ వై. నాగమణిలకు వినతిపత్రం అందజేశారు

రూ. 10 వేల కోట్ల మైలురాయిని దాటిన బ్రాండ్‌గా సామ్‌సంగ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, 2024 క్యాలెండర్ సంవత్సరంలో తమ టెలివిజన్ వ్యాపారం 10 వేల కోట్ల రూపాయల అమ్మకాలను అధిగమించిందని వెల్లడించింది. దీనితో భారతదేశంలో టెలివిజన్ పరిశ్రమలో ఈ ముఖ్యమైన మైలురాయిని సాధించిన మొదటి బ్రాండ్‌గా సామ్‌సంగ్ అవతరించింది. ప్రీమియం టీవీల విస్తృతమైన పోర్ట్‌ఫోలియో, పెద్ద స్క్రీన్, ఏఐ శక్తివంతమైన టెలివిజన్‌లకు పెరుగుతున్న డిమాండ్ ద్వారా 2025లో రెండంకెల వృద్ధిని సాధించగలమనే నమ్మకాన్ని సామ్‌సంగ్ తెలిపింది.

ప్రజా సమస్యలపై 81 ఫిర్యాదులు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 81 ఫిర్యాదులు అందాయి. పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు సోమవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) నిర్వహించారు. డీసీపీ కృష్ణమూర్తి నాయుడు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. భూవివాదాలు, ఆస్తి వివాదాలు, నగదు లావాదేవీలు 39, భార్యభర్తలు, కుటుంబ కలహాలు 7, మహిళా సంబంధిత నేరాలు 7, దొంగతనాలు 4, కొట్లాట 5, సైబర్ నేరాలు 5, వివాదాలు, సమస్యలు 14, మొత్తం 81 ఫిర్యాదులు అందాయి. దీనికి సంబంధిత ఆయా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోలకు ఫోన్‌లో మాట్లాడి సంబంధిత సమస్యలను చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల బదిలీ

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ఒకే పోలీస్ స్టేషన్‌లో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, పోలీస్ కానిస్టేబుల్‌లను విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖర్‌బాబు కౌన్సిలింగ్ నిర్వహించారు. సోమవారం పోలీస్ కమిషనరేట్‌లో ఒకే పోలీస్ స్టేషన్‌లో 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిబ్బందిని ఆయన కౌన్సిలింగ్ జరిపారు. వారితో స్వయంగా మాట్లాడి వారి అభ్యర్థన మేరకు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈనేపథ్యంలో 14 మంది ఏఎస్ఐ, 118 మంది హెడ్ కానిస్టేబుల్, 188 మంది కానిస్టేబుల్స్‌ను కౌన్సిలింగ్ నిర్వహించి వివిధ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎన్నడూ లేని విధంగా సిబ్బందితో మాట్లాడి స్వయంగా మాట్లాడి వారి అభ్యర్థనల మేరకు బదిలీ చేసినందుకు పోలీస్ కమిషనర్‌కు సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ కేజీవీ సరిత, ఏడీసీపీ ఎం.రాజారావు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మహానాడు తరలిరండి

విశాలాంధ్ర -పెదపారుపూడి : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు ఆధ్వర్యంలో పార్టీని ఏ విధంగా బలోపేతం చేశారో, అదే విధంగా టిడిపి జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టిడిపిని తన భుజస్కంధాలపై వేసుకొని అనేక ఇబ్బందులు ఏర్పడినప్పటికీ తన శక్తికి మించి పని చేస్తూ పార్టీని అభివృద్ధి పథంలో నడపడానికి చేసిన కృషిలో భాగంగా ఈనెల 27, 28, 29 తేదీలలో కడపలో జరుగు మహానాడుకు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సూచన మేరకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి వెళ్లి జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు సోమవారం చలసాని పిలుపునిచ్చారు. టిడిపి మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మని ముక్కు రాంబాబు, ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు.

దళితులపై అక్రమ కేసులు

- తెనాలి పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలి...
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: దళితుల యువకులపై అక్రమ కేసులు బనాయించి విచక్షణారహితంగా కొట్టిన తెనాలి పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెనాలి 3 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కన్నా చిరంజీవి తనకు సంబంధంలేని 2 టౌన్ పరిధిలోని యువకులను డబ్బులు ఇవ్వమని డిమాండ్ చేశాడని తెలిపారు. లేని పక్షంలో అక్రమ కేసులు, గంజాయి కేసుల్లో ఇరికిస్తామని 3టౌన్ రమేష్ బాబు చెప్పమన్నాడని అంటూ బెదిరించాడన్నారు. తమ వద్ద డబ్బులులేవని ఆ యువకులు తిరస్కరించగా ఆక్రోశంలో ఊగిపోయిన కానిస్టేబుల్ తన అవినీతి, అక్రమాల బాగోతం కప్పిపుచ్చుకునేందుకు ముందస్తుగా యువకులపై అక్రమ కేసు పెట్టినాడని తెలిపారు. దీంతో చెబ్రోలు జాన్ విక్టర్, దోమ రాకేష్, షేక్ బాబులాల్ ఏ కరిముల్లా అనే యువకులను పోలీసులు అరెస్టు చేసి అక్రమంగా స్టేషన్‌లో నిర్బంధించి విచక్షణారహితంగా కొట్టారని తెలిపారు. యువకులను వీధి వీధుల తిప్పుతూ తెనాలి, ఐతానగర్ ప్రధాన కూడళ్ళలో రోడ్డుపై కూర్చోబెట్టి బహిరంగ ప్రదేశాలలో ప్రజలు చూస్తుండగా విచక్షణారహితంగా, అతిక్రూరంగా కొట్టారని తెలిపారు. దోమ రాకేష్ యువకుని చేతులకు, కాళ్లకు రాడ్డు కట్టి రోడ్లపై తిప్పుతూ నరకాన్ని చూపించారని,ఆ బాధను భరించలేక ఎంత మొత్తుకున్న చివరకు కాళ్లు పట్టుకున్న పోలీసులు కనికరించలేదని వాపోయారు. ప్రజలందరూ చూస్తు ఉండగా మానవ మృగాళ్ల వ్యవహరించిన పోలీసుల తీరును చూసి స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారని తెలిపారు. మానవ హక్కులను కాపాడవలసిన పోలీసులే ఇంతటి దురాగతానికి పాల్పడటం సహించరాని నేరమన్నారు. తప్పు చేస్తే న్యాయస్థానాలకు అప్పగించాలి గానీ అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ఎంతో భవిష్యత్తు ఉన్న యువకులపై ఇంత కిరాతకానికి పాల్పడటం దుర్మార్గపు చర్యని మండిపడ్డారు. ఎటువంటి నేరం చేయకపోయిన అడిగిన డబ్బులు ఇవ్వనందుకు విచక్షణ రహితంగా దాడి చేసిన 2,3టౌన్ పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జగదీష్ మృతి

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్ : రాష్ట్రాన్ని జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన ప్రముఖ కయాకింగ్, కెనాయింగ్ క్రీడాకారుడు వేమూరు జగదీష్ (38) గత రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఆయన మరణవార్త క్రీడా రంగాన్ని తీవ్ర విషాదంలో ముంచింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జగదీష్, తన పట్టుదల, శ్రమతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కయాకర్‌గా ఎదిగారు. నదులపై నావ నడపడంలో ఆయన ప్రావీణ్యం దేశ, జాతీయస్థాయిలో పోటీల్లో పలు బంగారు పతకాలను అందించడంలో తోడ్పడ్డారు. జగదీష్ యువ క్రీడాకారులకు ప్రేరణగా నిలిచారు. కేవలం క్రీడాకారుడిగానే కాకుండా, ఓ మార్గదర్శకుడిగా పేరు పొందారు. క్రీడల పట్ల ఆయన చాటిన నిబద్ధత చాలా మందికి ప్రేరణ కలిగించారు.ఆయన మృతి పట్ల క్రీడా సంఘాలు, అభిమానులు, తోటి క్రీడాకారులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు కెనఇంగ్ కాయా కింగ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి సహా పలు క్రీడా సంఘాల ప్రతినిధులు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. జగదీష్ మృతి ఆంధ్ర ప్రదేశ్ కయాకింగ్ , కేనయింగ్ క్రీడకు తీరని లోటుగా పేర్కొంటున్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ తరగతులు

విశాలాంధ్ర, కూచిపూడి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న దరఖాస్తుదారులే కాకుండా ఆసక్తి కలవారు ఈనెల 27 ఉదయం7 గంటల నుండి 8 గంటల వరకు వరుసగా ఐదు రోజులు 31 యోగ శిక్షణలో మాస్టర్ ట్రైనర్స్ వచ్చి ట్రైనింగ్ ఇస్తారని ఎంపీడీవో జె. విమాదేవి సోమవారం ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులందరు మొవ్వ శ్రీ మండల కనకయ్య సులోచన క్షేత్రయ్య కళ్యాణ మండపంలో యోగామాట్స్, బెడ్ షీట్స్ తో వచ్చి పాల్గొన వలసినదిగా సూచించారు.

కంప్యూటర్‌పై అవగాహన శిక్షణ

విశాలాంధ్ర-పెదపారుపూడి :మండలంలోని యలమర్రు గ్రంథాలయ శాఖలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహనతో కూడిన శిక్షణ సోమవారం ఇవ్వటం జరిగిందని ఆ గ్రంథాలయ శాఖ అధికారిణి జే. విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా పెదపారుపూడి గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా పై అవగాహన శిక్షణ విద్యార్థులకు వివరించడం జరిగిందని గ్రంథాలయ శాఖ అధికారిణి ఎం. వి. ఎస్. లక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు దంతనాల భాస్కరరావు, ఆయా గ్రంథాలయాల సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

రోడ్డుపై నీళ్లు...ప్రజల ఇబ్బందులు...

విశాలాంధ్ర - గన్నవరం : గన్నవరం గౌడ్ పేటలోని తోడేపాడు చెరువు నిండి రోడ్డుపై నీళ్లు ప్రవహిస్తున్నాయి. దీంతో నీళ్లలో నడవలేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తోడేపాడు చెరువు వేసవి కాలంలో చెరువు నిండి ఉండటం వల్ల ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపైకి నీళ్లు ప్రవహిస్తున్నాయి. వచ్చేది వర్ష కాలం ఎక్కువ వార్షాలు కురిస్తే వర్షాలవల్ల చెరువు నిండి ఇళ్లలోకి చేరుతాయని చుట్టు ప్రక్కలా నిరాసితులు భయంతో ఆందోళన చెందు తున్నారు. త్వరగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిత్ర లేఖనంలో విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర -గంపలగూడెం : గంపలగూడెం మండలం పెనుగోలను శాఖ గ్రంథాలయం నందు సోమవారం వేసవి శిక్షణా తరగతులలో భాగంగా విద్యార్థుల చేత పుస్తక పఠనం చేయించటం,విద్యార్థుల చేత కథలు చెప్పించటం, అలాగే హ్యాండ్ రైటింగ్ ప్రాక్టీస్ చేయించటమైనది. 8 వ తరగతి చదువుచున్న కె. రీతిక చేత బోర్డు పై డ్రాయింగ్ వేసింది. తనకు డ్రాయింగ్ వేయటం అంటే చాలా ఇష్టం అని , ఏదైనా సాధించాలంటే పట్టుదల ఉండాలని అలాగే నేను కూడా నేర్చుకున్నానని విద్యార్థులకు తెలిపింది. అలాగే శిక్షణా లో భాగంగా సరదాగా విద్యార్థులకు మోనో యాక్షన్ మరియు అంకెల్లో చెప్పుకొండి చూద్దాం అనే ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు మరియు వి. నారాయణ రావు,గ్రంథాలయ నిర్వాహకురాలు జె. శ్రీలత పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : నా భర్త చేసిన అప్పు తీర్చమని కొడుకుని తాకట్టు పెట్టుకుని ఆపై క్రూరంగా హత్య చేసారని కన్నీటి పర్యాంతమైంది హత్యకు గురైన బాలుడి తల్లి అంకమ్మ.కేవలం 15వేలు అప్పు చేసిన నేరానికి కుటుంభంతో సహా వెట్టి చాకిరీ చేయించుకొని చివరకు 9 సం.ల బిడ్డను(వెంకటేష్) హత్య చేసిన దుండగుల్ని ఎట్టి పరిస్థితుల్లో వదలకుండా శిక్షించి తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో వెట్టి విమోచన వేదిక, ఇతర స్వచ్చంద సభ్యులతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమె మాట్లాడుతూ తిరుపతి జిల్లా గూడురు మండలం చవటపాలెంలో తన భర్తతో కలసి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నామని తమ అవసరాలు నిమిత్తం తన భర్త సత్యవేడుకు చెందిన ముత్తు అనే ఆయన దగ్గర రూ.15 వేలు అప్పు తీసుకున్నారని అనంతరం తన భర్త మృతి చెందాడన్నారు. ముత్తు తన డబ్బు చెల్లించాలని వత్తిడి చేశారని తాను పది రోజులు గడువులో తెచ్చి ఇస్తానని చెప్పిన వినకుండా ఒక కొడుకును తన వద్దే గ్యారంటీ కోసం అట్టిపెట్టుకొని వడ్డీతో కలిసి రూ.45,000 ఇవ్వాలని డిమాండ్ చేశాడన్నారు. ఏప్రిల్ చివరి వారంలో బకాయి సొమ్ము సమకూర్చుకుని ఇవ్వటానికి వెళితే అబ్బాయి ఎక్కడో ఉన్నాడని తెలియదని ఆ తర్వాత ఆసుపత్రిలో ఉన్నాడని, ఆ తర్వాత పారిపోయాడని ఏదో కుంటి సాకులు చెబుతూ వచ్చాడని కన్నీరు పర్యాంతమైంది. ఎంతకు చూపించకపోవటం తో పోలీసులను ఆశ్రయించటంతో పచ్చకామర్లతో చనిపోయాడని నా కొడుకు మృత దేహాన్ని మట్టిలో పాతేసిన ప్రాంతాన్ని చూపాడని బోరున విలపిస్తూ తెలిపారు. వెట్టి నిర్మూలన కార్యదర్శి సునీల్ కుమార్ మాట్లాడుతూ

తమిళనాడులోని కాంచీపురంలో తొలుత పిల్లవాడు పారిపోయాడని బుకాయించడం, గిరిజన మహిళ తన కులానికే చెందిన కొందరితో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ మొత్తం వ్యవహారం బయటపడిందన్నారు. గిరిజన యానాది తెగకు చెందిన అంకమ్మ, అతని భర్తయ చెంచయ్య, ముగ్గురు కుమారులు తిరుపతిలో బాతుల పెంపకందారు వద్ద ఏడాది పాటు పనిచేశారన్నారు. ఆ తర్వాత చెంచయ్య మరణించడంతో అతను తనకు రూ.15,000 బాకీ పడ్డాడంటూ అంకమ్మ, ముగ్గురు కుమారులను తన వద్దే చాకిరీ చేయించుకుంటూ వచ్చాడన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్ళు గడుస్తున్న, అనేక చట్టాలు గిరిజనులు ఉన్న నేటికీ ఏదో ఓ మూల వెట్టి చాకిరికి బలి ఆతున్నరన్నారు. బాలున్ని కిరతకంగా హత్య చేసిన నిందితుడిపై వెట్టిచాకిరీ నిరోధక చట్టం, బాలకార్మిక చట్టం, జ్యువనైల్ జస్టిస్ చట్టం, ఎస్సీ, ఎస్టీ అకృత్యాల చట్టం, భారతీయ న్యాయసంహితలోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జీవన్ జ్వాల నాయకురాలు తేన్మోయి, యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటతి పాల్గొన్నారు.

ఐక్యూ నియో10 ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయవాడ: హై పెర్ఫార్మెన్స్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ ఐక్యూ తన లేటెస్ట్ పవర్ హౌస్ ఐక్యూ నియో 10ను ఆవిష్కరించింది. యువ నిపుణుల నుండి భారీ-పనితీరు వినియోగదారుల వరకు యువత కోసం ఇది రూపొం దింది. దానిమార్గదర్శక డ్యూయల్-చిప్ ఆర్కిటెక్చర్, మెరుగైన శీతలీకరణ వ్యవస్థ, ఐక్యూ నియో10 భారతదేశపు మొట్టమొదటి స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ 4 చిప్‌సెట్‌తో వస్తుందని శక్తివంతమైన 7000 ఎంఏహెచ్ బ్యాటరీని స్లిమ్ డిజైన్‌లో ఏకీకృతం చేస్తుంది.సోమవారం నుండి ప్రీ-బుకింగ్ అందుబాటులో ఉంది. జూన్ 3, మధ్యాహ్నం 12 గంటల నుంచి ఐక్యూ ఈస్టోర్, అమెజాన్.ఇన్‌లో అమ్మకం ప్రారంభమవుతుంది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఉండవల్లిలో గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న పేకాట స్థావరంపై సోమవారం తాడేపల్లి ఎస్ఐ ఎస్కే ఖాజావలి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.13,500లు నగదును స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లి సీఐ బత్తుల కళ్యాణ రాజు ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

2 నుంచి కుట్టుశిక్షణ తరగతులు

విశాలాంధ్ర-పెదనందిపాడు : జూన్ 2వ తేదీ నుంచి స్థానిక తెళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) వారి సహకారంతో నాలుగో బ్యాచ్ కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు విజ్ఞానకేంద్రం కన్వీనర్ దొప్పలపూడి రమేష్ బాబు సోమవారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు జూన్ 1వ తేదీలోపు రూ.1000 ప్రవేశరుసుము చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

నిరసన దీక్ష విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-పెదనందిపాడు : నల్లబర్లి పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని చిలకలూరిపేట ఐటీసీ పొగాకు కంపెనీ ఎదురు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి జరుగు రైతుల నిరసన దీక్షను రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని విజయవంతం చేయాలని రైతు సంఘాల సమన్వయ సమితి ప్రతినిధులు సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులపై శ్రద్ధ

విశాలాంధ్ర-పొన్నూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను గుర్తించి వారిని వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలలో చేర్పించేందుకు మండల స్థాయి ఐఈ ఆర్పీలు ప్రత్యేక శ్రద్ధ కనపరచాలని ఐఈ(ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్) కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పొన్నూరు పట్టణం సాయి నగర్‌లో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారిని గుర్తించి వారి తల్లిదండ్రుల వద్ద వివరాలు సేకరించారు. ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్‌పై వారికి అవగాహన కల్పించారు. పొన్నూరు భవిత కేంద్రం ఐఈ ఆర్పీ ఉపాధ్యాయురాలు బి.విజయ కుమారి పాల్గొన్నారు.

శిథిలావస్థలో వంతెన

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో అర్జీ

విశాలాంధ్ర-పెదకాకాని : గ్రామం నుంచి గొల్లమూడి పోవు రహదారిలో గుంటూరు ఛానల్‌పై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరిందని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పెదకాకాని గ్రామానికి చెందిన వసంతరావు అర్జీని అందజేశారు. ఈ వంతెన పైనుంచి సీజన్ కాలంలో ధాన్యపు లారీలు, ట్రాక్టర్లు, ఇసుక లోడుతో రాకపోకలు జరుగుతాయని, గత 60 సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెన కావడంతో శిథిలావస్థలో చేరి ప్రయాణికులకు ఆటంకం కలిగిస్తుందన్నారు. వెంటనే కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని అర్జీ అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు, ఆలా శ్రీను, కొండలు, బాజీ, శివ కోటేశ్వరరావు, వెంకయ్య, భవాని శేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే పల్లెనిద్ర

విశాలాంధ్ర-మంగళగిరి : పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామస్తుల నుంచి పలు ఫిర్యాదులు, సమస్యలను గుర్తించినట్లు మంగళగిరి గ్రామీణ సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి మంగళగిరి మండలం కాజాలో పల్లెనిద్రలో భాగంగా గ్రామస్తులతో మాట్లాడారు. వారి నుంచి కొన్ని ఫిర్యాదులు, సమస్యలను గుర్తించారు. గ్రామంలో కొంతమంది వ్యాపార సముదాయాల వద్ద, రోడ్డుపైన ఎక్కువ సమయం వాహనాలను పార్కింగ్ చేయడం వలన ఇబ్బందికరంగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారని, కాజా టోల్ గేట్ హైవే వైపు వాహనాలు వెళ్లకుండా టోల్‌ను తప్పించుకునేందుకు భారీ వాహనాలు గ్రామంలో గుండా వెళ్లడం వలన ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని వారు తమ దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. గ్రామంలో బహిరంగ మద్యపానం, అతివేగంగా వాహనాలు నడిపే వారి, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి వివరాలను అందజేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చినా వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని వారు తెలియజేశారు. పాఠశాల వదిలే సమయంలో స్వాయంత్రం పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరినట్లు తెలిపారు. గ్రామంలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించగా గ్రామ పెద్దలు పలు ప్రధాన కూడళ్లలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు వచ్చారు. మెయిన్ సెంటర్‌లో ఉన్న షాప్ యజమానులు వెంటనే పార్కింగ్ బోర్డ్స్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని, అదేవిధంగా సైబర్ మోసాల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గ్రామస్తులతో చర్చించామని ఎస్సై వెంకట్ తెలిపారు.

సుపరిపాలనకు సమగ్ర కులగణనే కీలకం

విశాలాంధ్ర-మంగళగిరి : సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందించి సామాజిక అభివృద్ధి సజావుగా జరిగేలా జనరంజకంగా సుపరిపాలనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించాలంటే జన గణనతో పాటు సమగ్ర కుల గణన జరపడమే కీలకమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశ ప్రజలందరినీ వారి వారి కులాలతో సహా లెక్కించడం ద్వారా ఆయా కులాల జనాభా ఎంతెంత ఉంది వారిలో ఎందరు సామాజిక ఆర్థిక రాజకీయ విద్య ఉద్యోగ రంగాలలో ఏ మేరకు వెనుకబడి ఉన్నారు అనే అంచనాలు వేయడానికి ప్రభుత్వాలకు ఉపయోగపడుతుందన్నారు. 2047 విజన్ వికసిత భారత్‌తో పాటు రాష్ట్రంలో విజన్ స్వర్ణాంధ్ర సాధనతో ప్రపంచంలోనే మరో అగ్రరాజ్యంగా భారత్ అవతరించే అవకాశాలు మెరుగుపడుతున్నాయన్నారు. మోదీ అధ్యక్షతన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉపముఖ్యమంత్రులతో జరిగిన అత్యున్నత సమావేశం దేశంలో సుపరిపాలనకు చేపట్టనున్న సమగ్ర కులగణను ఏ మేరకు ఉపయోగించుకోవాలో ఆ సమావేశాల్లో చర్చించడాన్ని దేశ ప్రజలందరితోపాటు ముఖ్యంగా బీసీ సమాజం హర్షిస్తుందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

పూసపాటి కృష్ణ సూర్యకుమార్ మేధాశక్తి ప్రశంసనీయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పెద్దగా ఉన్నత డిగ్రీలు చదువుకోని పూసపాటి కృష్ణ సూర్య కుమార్ రెండుసార్లు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం ఆయన మేధాశక్తికి, ప్రజ్ఞా పాటవాలకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు కొనియాడారు. 70 సంవత్సరాల వయసులో వాట్సప్ మాధ్యమం ద్వారా తన అర్థమెటిక్ ఫార్ములాతో ఎమ్మెస్ ఎక్సెల్ షీట్ ద్వారా 10,48,574 గడులలో అంతే సంఖ్యలో కేవలం ఒక్క గంటలో జవాబులు వ్రాసి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన స్థానం పొందారన్నారు. వారి నుండి ప్రశంసా పత్రం అందుకోవడమే, వాట్సప్ మాధ్యమం ద్వారా తెలుగు పద్య రచనపై వందలాది మంది తెలుగు ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తు రెండుసార్లు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం పొందిన పూసపాటి కృష్ణ సూర్య కుమార్‌ను లక్ష్మణరావు బ్రాడీపేటలోని తన కార్యాలయంలో శాలువా జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ కృష్ణ కుమార్ త్వరలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా స్థానం సంపాదించు కోవాలని ఆశాభావం వ్యక్తంచేశారు. సన్మాన గ్రహీత కృష్ణ కుమార్ మాట్లాడుతూ గత కరోనా సమయంలో ప్రత్యేక శ్రద్ధతో తాను చేసిన ప్రయోగానికి కృషికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ పూర్తి స్థాయి తృప్తి చెంది తనకు ప్రత్యేకంగా గుర్తింపు అందించారన్నారు. కార్యక్రమంలో పూసపాటి నాగమణి, యుటిఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, కళాధర్, వెలగా వినోద్, వాసుదేవ శర్మ, రాధాకృష్ణమూర్తి, ఓంకార్స్ రాము, ఏక వెంకటరామయ్య, దామరాజు రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య కార్మికులు ఇతర విధుల్లో ఉండొద్దు: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగ కార్మికులు, సూపర్‌వైజర్లు లేదా ఇతర విధుల్లో ఉండడానికి వీలులేదని, వారు కేటాయించబడిన పారిశుధ్య పనుల్లోనే ఉండాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ప్రజారోగ్య అధికారులకు స్పష్టం చేశారు. స్థానిక జీటీ రోడ్, కేవీపీ కాలనీ రోడ్‌లోని పలు ప్రాంతాలల్లో కమిషనర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికులుగా ఉన్న వారు పారిశుధ్య పనులు కాకుండా సూపర్‌వైజర్లు పేరుతో ఉంటున్నారని, వారిని తక్షణం పారిశుధ్య విధులు కేటాయించాలని ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఇక నుంచి తమ క్షేత్ర స్థాయి పర్యటనలలో సూపర్‌వైజర్లను గుర్తిస్తే సంబంధిత ఇన్‌స్పెక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, డీఈఈ మధుసూదన్, బయాలజిస్ట్ రామారావు, ఎస్ఎస్ రాజేష్, సచివాలయ ఏఈ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జాతీయ ఉషు పోటీలకు క్రీడాకారుల ఎంపిక

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : కర్నూలు జిల్లాలో ఈ నెల 12 నుంచి 14వ తేది వరకు జరిగిన 12వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్ ఉషు ఛాంపియన్‌షిప్‌లో గుంటూరు విద్యార్థులు గెలుపొందినట్లు కోచ్ ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. ఈ పోటీలలో కె.యువన్ బంగారు పతకం, కె.నైనిక బంగారు పతకం, వి.అంకిత్ రజత పతకం, కె.మహేద్యుత్ కాంస్య పతకం, ఎం.వెంకటరమణ బంగారు పతకం, వై.జస్వంత్ కాంస్య పతకాలు గెలుపొందినట్లు చెప్పారు. వీరిని ఉషు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.అదిశేషు, బండి నరసింహారావు అభినందించి పతకాలు అందించారు. డాక్టర్ ఎ.సృజన్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలలో గుంటూరు విద్యార్థులు పతకాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. చదువుల్లో కూడా ముందుండాలని విద్యార్థులను అభినందించారు. పతకాలు సాధించిన విద్యార్థులు ఈ నెల 26 నుంచి 31 వరకు చెన్నై ఈ రోడ్లో జరిగే జాతీయ స్థాయి 25వ సబ్ జూనియర్ నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు కోచ్ ఎం.కిరణ్ కుమార్ తెలియజేశారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

విశాలాంధ్ర- మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి సహకారంతో మారుతి మహిళ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద కళా జాతర బృందాలతో వీధి నాటకాల ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది ఎలా వ్యాపి స్తుంది? ఈ వ్యాధి రాకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. యాక్ట్ 2017 గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా టోల్ ఫ్రీ నెంబర్ 1097 ద్వారా కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ గంగాభవాని, ఏఎన్ఎం ప్రత్యూష, ఏ.డీ కిషోర్ గోపి, ఓఆర్‌డబ్ల్యు చిరంజీవి, అంజలి, శార కుమారి, నాగరాజు, రఫన్యా, సాయి సుధా, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సుపరిపాలన

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రజ లకు సుపరిపాలన అందిందని అవర్ స్టేట్ అవర్ లీడర్ సభ్యులు అపిరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. యూఎస్ఏ పర్యటనలో భాగంగా వైసీపీ కార్యకర్తలు, అభిమానులను కలిసిన ఆయన అనేక సమావేశాలు, గ్రూప్ డిస్కషన్‌లు జరిపారు. యూఎస్ఏ అవర్ స్టేట్ అవర్ లీడర్ సభ్యులు శివ అన్నపురెడ్డి అధ్యక్షతన డల్లాస్‌లో జరిగిన కార్యక్రమంలో కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి తన ఆనందంగా, ప్రతిఒక్కరికీ సామాజిక ఆర్థికాభివృద్ధి కావాలని జగన్ ఆశించారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే టీజే సుధాకర్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి కక్ష సాధింపు చర్యలు, అరెస్టుల పర్వాలు తప్పితే ప్రజా సంక్షేమ చర్యలు గాని, ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఆలోచన లేకుండా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రమణారెడ్డి, డాక్టర్ రామిరెడ్డి, ప్రసాద్, భీమవరపు సాంబిరెడ్డి, పాల్ రెడ్డి, దర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి కారుణ్య నియామకాల ఉత్తర్వులు అందజేత

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : కారుణ్య నియామకం లో భాగంగా కొటికల సాల్మన్ రాజు, రుంజల రవి సాగర్, పద్మ సాయి నిఖిల ముగ్గురికి వ్యవసాయ శాఖలో జూనియర్ ఆఫీసు అసిస్టెంట్లుగా నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం అందించారు. నిబంధనల మేరకు వారికి కేటాయించిన శాఖలో డ్యూటీకి రిపోర్ట్ చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ కుమారి, డీఆర్వో షేక్ ఖాజావలి, స్టెప్ సీఈఓ ఆర్.చంద్రమౌని, ఆర్డీఓ శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ జ్యోతిబసు, డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు శంకర్, విజయలక్ష్మీ, ప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, డీపీఓ బీవీ నాగ సాయి కుమార్, జిల్లా ఉద్యాన అధికారి రవీంద్ర, ఎస్ఈ పంచా యతీ రాజ్ బ్రహ్మయ్య, డీఎస్‌డబ్ల్యు ఎస్.మోహన్, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ, సీపీఓ శేషశ్రీ, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కోటేశ్వరరావు

విశాలాంధ్ర-గురజాల : వైసీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలలో వివిధ హోదాలకు సంభందించిన నియా మకాలను పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం జరిపింది. పల్నాడు జిల్లాకు మూడు విభాగాలలో చోటు దక్కింది. గురజాల ఎస్సీ వర్గానికి చెందిన న్యాయవాది కర్రా చిన్న కోటేశ్వరరావు వైసిపి పార్టీకి విధేయుడుగా కొనసాగుతున్నారు. 2007లో పల్నాడు వైయస్ జగన్ యువజన సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలానే జగన్ మీద అభిమానంతో తన కుమారుడుకు కర్రా వైయస్ జగన్మోహన్ రెడ్డిగా నామకరణం జరిపి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ మేరకు వైసిపి రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కోటేశ్వరరావును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా కర్రా చిన కోటేశ్వరరావు పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డికు కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యేలు కాసు మహేష్ రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవి. సుబ్బారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. కోటేశ్వరరావు నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం తెలిపారు.

పరిష్కార వేదికకు 75 ఫిర్యాదులు

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు,మోసం మొదలగు ఆయా సమస్యలకు సంబంధించి 75 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని, సమస్య పట్ల శ్రద్ధ వహించి, నిర్ణీత గడువు లోగా పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ కంచి శ్రీనివాసరావు సూచించారు. ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహాయ సహకారాలు అందించారు.

వైస్ ఎంపీపీగా రమాదేవి

విశాలాంధ్ర - కారంపూడి : మండలం ఉప ఎంపీపీగా టిడిపి బలపరిచిన పేట సన్నెగండ్ల ఎంపీటీసీ -2 గాడిపర్తి రమాదేవి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలం లోని వేపకంపల్లి ఎంపీటీసీ ఉప ఎంపీపీ - 2 గా కొనసాగుతూ మరణించడంతో ఉప ఎంపీపీ ఎన్నిక నోటిఫికేషన్ ను ప్రభుత్వం జారీ చేసింది. గత రెండు పర్యాయాలు వైసీపీ ఎంపీటీసీలు గైర్హాజరవడంతో ఉప ఎంపీపీ ఎన్నిక వాయిదా పడింది. ఎన్నిక కమిషన్ నేడు నోటిఫికేషన్ ఇవ్వడంతో అధికారులు ఎంపీటీసీ లకు నోటీసు లు జారీ చేశారు. 14 మంది ఎంపీటీసీలకు గాను ఆరుగురు హాజరు కాగా గాదెవారిపల్లి ఎంపీటీసీ కూనిరెడ్డి నాల్గోవ సైదారెడ్డి ప్రతిపాదించగా, ఒప్పిచర్ల చెందిన ఇద్దరు ఎంపీటీసీలు బలపరిచారు. మిగతా ఎంపీటీసీలు మద్దతుతో ఉప ఎంపీపీ గా రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎస్ లింగమూర్తి అధికారికంగా ప్రకటించారు.. అనంతరం ఎంపీటీసీలు మండల స్థాయి అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు రమాదేవిని ఘనంగా సన్మానించారు. ఈ ఎన్నికను జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనరే పరిశీలించారు.

రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందజేయాలి

విశాలాంధ్ర - నరసరావుపేట: రైతులకు అన్ని రకాల విత్తనాలను ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో అందజేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు తాళ్లూరి బాబురావు అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము మాట్లాడుతూ సన్న చిన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీపై రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలు ఆర్బికే కేంద్రాల ద్వారా రైతులకు ఇవ్వాలన్నారు. అదే విధంగా సూక్ష్మ నీటి సేద్యపు పరికరాలు పైపులు స్పిన్నర్లు, రెండు లక్షల లోపు ఉన్న రైతు రుణాలన్నీ ఏకకాలంలో రద్దు చేయాలని అన్నారు. 60 సంవత్సరాలు నిండిన రైతులకు రూ.పది వేల పెన్షన్ భార్యాభర్త ఇద్దరికీ ఇవ్వాలని, జిల్లాలో జిపిఐ పొగాకు కంపెనీ రైతులకు బాండ్లు జారీ చేసి రైతుల వద్ద నుండి మూడు నెలలుగా పొగాకును కొనకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని వెంటనే జిపిఐ కంపెనీ మీద చర్యలు తీసుకొని రైతులు వద్ద పొగాకును కొనే విధంగా చూడాలని తెలిపారు. మిర్చి రైతులకు కనీస మద్దతు ధర రూ.15వేలు ప్రకటించాలని షరతులు లేకుండా రైతులు వద్ద ఉన్న కందులు కొనుగోలు చేయాలని అనేక అంశాలపై కలెక్టర్‌తో మాట్లాడి ఆయనకు అర్జీ అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సం ఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు తాళ్లూ రు బాబురావు, కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు మేకపోతు శ్రీనివాసరెడ్డి, లక్ష్మాధికారి, రొడ్డ అంజి రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సత్యానా రాయణ రాజు, అప్పరాజు, పవన్ కుమార్, మల్లికార్జునరావు, రాయ బారం వందనం, మహిళా రైతులు లక్ష్మి. రమాదేవి. కుమారి, రాఘవమ్మ, అనంతమ్మ, ఇమాంబి, రాజమ్మ పాల్గొన్నారు.

చంపింది, చనిపోయింది టీడీపీ వారే: గోపిరెడ్డి

విశాలాంధ్ర-నరసరావుపేట: రెండు రోజుల క్రితం మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం ముళ్లపాడు గ్రామం లో ఇరువురు టిడిపి కార్యకర్తలు దేవి శెట్టి వెంకటేశ్వర్లు, దేవి శెట్టి కోటేశ్వ రరావు బైక్ మీద వెళుతుండగా వెనక నుంచి జెబిఆర్ అనే అక్షరాలతో ఉన్న సుమో వాహనంతో గుద్ది, వాళ్లు చని పోయారో, లేదో అని వెనక్కు వచ్చి రాళ్లతో, కత్తులతో హతమార్చిన సంఘటన అందరికీ తెలిసిందేనని, చంపిన వారి పేర్లు ఏ1 దేవిశెట్టి శ్రీనివాసరావు, ఏ2 తోట వెంకట రామయ్య అనే వ్యక్తులని వీరు కూడా టిడిపి వాళ్లేనని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పారు. చంపిన వారు, చనిపోయిన వారు టీడీపీ వారే అయితే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, వైసీపీ అధ్యక్షుడైన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఒక సంవత్సర కాలం గా ఊళ్లో లేని ఎక్కడున్నాడో కూడా తెలియని అతని తమ్ముడు వెంకటరామిరెడ్డిపై కేసులు బనాయించటం అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి తప్పుడు కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు.

మాచర్లలో 1న తెలుగు సినీ పాటల పోటీలు

విశాలాంధ్ర-మాచర్ల : గాన గంధర్వుడు డాక్టర్ ఎస్.పి బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని మానుకొండ కళ్యాణ మండపంలో జూన్ 1న ఆదివారం సాయంత్రం 7 గంటలకు డాక్టర్ ఎస్.పి బాలసుబ్రమణ్యం కళా పరిషత్ మాచర్ల ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి సినిమా పాటల పోటీలను నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షులు కొత్తమాసు శ్రీరామమూర్తి తెలిపారు. సోమవారం పట్టణంలోని మెడికల్ అసోసియేషన్ భవనంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీన ఉదయం 9 గంటలకు ఎంపిక జరుగుతుందని, ఈ ఎంపికలో 25 మంది గాయనీ గాయకులను ముగ్గురు న్యాయ నిర్ణేతలు ఎంపిక చేస్తారని, ఎంపికైన గాయనీ గాయకులతో అదే రోజు సాయంత్రం ఏడు గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్యఅతిథిగా రానున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి 10,000 రూపాయలు, రెండవ బహుమతి రూ.7,000లు,మూడవ బహుమతి రూ.5,000లు, నాలుగవ బహుమతి రూ.4,000లు,5వ బహుమతి రూ.3,000 రూపాయల నగదు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు.అదేవిధంగా ఎంపికైన మరో 20 మంది గాయనీ గాయకులకు ఒక్కొక్కరికి రూ. 1000ల చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి కళాభిమానులు,కళాపోషకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, వివరాలకు 9505453457,9573786029, 9866537346 సంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి మాగులూరి రాంబాబు, కోశాధికారి పఠాన్ జాన్ ఖాన్, ఉపాధ్యక్షులు బాహటం శేషగిరి రాజు,సహాయ కార్యదర్శి పులుసు శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓరుగంటి చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

మేదర సంఘం కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవం

విశాలాంధ్ర - వినుకొండ : మేదరి సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం వినుకొండ పట్టణంలోని గంగినేని కళ్యాణ మండపంలో సోమవారం జరిగింది. అన్ని జిల్లాల నుండి విచ్చేసిన కార్యవర్గ సభ్యులతో, అనుబంధ కమిటీలతో,మేదరి సంఘం ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహేంద్ర (మేదరి) అధ్యక్షులుగా, జొరిగె.మస్తాన్ రావు, ప్రధాన కార్యదర్శిగా పోలేపల్లి.నాగేంద్ర, కోశాధికారిగా సిరిగిరి మంగారావు, ప్రచార కార్యదర్శిగా పిల్లి.మాణిక్యాలరావు, ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. వీరితోపాటు అనేక అనుబంధ కమిటీల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు జొరిగె మస్తాన్ రావు మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలలో మా కులం ఆంధ్రప్రదేశ్ తెలంగాణ మినహాయించి ఎస్సీ,ఎస్టీల్లో, ఉన్నది కావునా, ప్రస్తుత ప్రభుత్వం మమ్మల్ని ఎస్టీలో చేర్చవలసిందిగా డిమాండ్ చేశారు. మళ్లీ సొసైటీలు ఏర్పాటు చేయాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరారు. వెదురుతో తయారు చేసే వస్తువులతో గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. గతంలో ఎన్నికల హామీలలో భాగంగా మా కులాన్ని ఎస్టీ లో చేరుస్తామని తెలిపారు. కావునా, మా స్థితిగతులు అర్థం చేసుకుని ఇప్పటికైనా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమ కులాన్ని ఎస్టీలో చేర్చాలని, సబ్సిడీపై మాకు ఎదురు సప్లై చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్, ఏల్లాలుబాబు, డి.ఏసుబాబు, ఎన్.హనుమాన్ ప్రసాద్ , జొరిగె.శ్రీనివాస రావు, కె. వెంకట రాముడు తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు వద్దు: యాగంటి

విశాలాంధ్ర-మాచర్ల : వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో హత్యా రాజకీయాలకు స్వస్తి పలికి అభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు అందరూ కృషి చేయాలని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వెల్దుర్తి మండలం గుళ్ళపాడులో జరిగిన జంట హత్యలపై స్పందించారు. ఫ్యాక్షన్, హత్యా రాజకీయాలతో అభివృద్ధి కుంటు పడటంతో పాటు,అనేక కుటుంబాలు రోడ్డును పడతాయన్న విషయం అందరూ గుర్తించాలన్నారు. ఆధిపత్యం కోసమో, నాయకుల మెప్పుకోసం ఒకరినొకరు హత్యలు చేసుకుంటూ పోతే జీవితం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు.అభివృద్ధిలో వెనుకబడిన మన మాచర్ల ప్రాంతాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో మరి అభివృద్ధి చెందనుదని, ఇలాంటి సమ యాలను హత్యా రాజకీయాలకు పాల్పడితే అభివృద్ధి పుట్టు పడుతుందన్నారు. జిల్లాలో ఎక్కడ లేని విధంగా మాచర్ల ప్రాంతంలోనే ఈ హత్య రాజకీయాలు జరుగుతుండడం ఆందోన కలిగిస్తుంద న్నారు. ఇప్పటికైనా హత్యా రాజకీయాలకు స్వస్తి పలికి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్ 1100 ద్వారా నమోదు చేసుకోవచ్చు

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించి ఫిర్యాదులను నేరుగా కలెక్టరేట్ నరసరావుపేటలో, ఆయా మండలాల్లో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గాని ఫిర్యాదులు సమర్పించవచ్చని తెలిపారు. పరిష్కార వేదికకు హాజరు కాలేని వారు టోల్ ఫ్రీ నెంబర్ 1100 కు ఫోన్ చేసి ఫిర్యాదుల నమోదు చేయించుకోవచ్చని తెలిపారు. ఇచ్చిన ఫిర్యాదులకు సంబంధించిన స్థితిని తెలుసుకు నేందుకు సమాచారం తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో నమోదు చేసు కోవచ్చన్నారు.

CHANGE OF SURNAME

I, **SAI PUJITHA MAGAM** (Old Name), W/o. **Nagarjuna Magam**, Resident of Door No: 1-16-2, B-65, 6th Line, S.V.N. Colony, Guntur - 522006, Guntur District, Andhra Pradesh. I have changed my surname as **GORANTLA SAI PUJITHA** (New Name) W/o. **Nagarjuna Magam**. Hereafter my surname is known as **GORANTLA SAI PUJITHA** (New Name) W/o. **Nagarjuna Magam.**

బహిరంగ ప్రకటన

మాక్లయింటు అయిన పిరమిల్ క్యాపిటల్ & హౌసింగ్ ఫైనాన్స్ గుంటూరుజిల్లా వారి సూచనలు పొంది ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునదేమనగా,ఈదా అంజి రెడ్డి గారి కుమారుడు వెంకటేశ్వర రెడ్డి గారు షెడ్యూల్ దాఖల ఆస్తిని తనఖాగా వుంచి ఋణంకొరకు సంప్రదించినారు. దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి గుడిబండి గోపిరెడ్డిగారికి వారి తండ్రిగారైన సీతారామిరెడ్డి గారివలన సంక్రమించినదని, ఆయన మాత్రమే సీతారామిరెడ్డి గారికి ఏకైక వారసుడుని అని చెప్పుచూ షెడ్యూలు ఆస్తిని సదరు గుడిబండి గోపిరెడ్డి మరియు అతని పిల్లలు కలసి పార్టీషన్ దస్తావేజు నెం.2017/2017గా రిజిష్టర్ చేసుకొని ఉన్నారు. కావున దిగువషెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు, తనఖాలు, తాకట్లు వగైరాలు వున్నయెడల ఈ ప్రకటన తేది నుండి 7రోజులలోగా నాకు గాని, నాక్లయింటుకు గాని తెలియజేయగలరు. గడువులోగా ఎట్టి క్లయి ములు రానియెడల షెడ్యూలు ఆస్తిని నిష్కేచిఆస్తిగా భావించి మా క్లయింటు ఋణం మంజూరు చేయుదురని తెలియజేయడమైనది

షెడ్యూలు:గుంటూరు డి॥, కొల్లిపర సబ్ డి॥, కొల్లిపర గ్రామ డి.నెం.1099-4రు యు.0.24సెంట్లు మింజుమలె 1వ బ్లాకులో డోర్.నెం.1-95కు సమీపమునగల చ.గ.539.69లు ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు.తూర్పు:**పంచాయితీ బజారు (జంగిల్ డొంక) హద్దు, 157 లింకులు, **దక్షిణం:**గుడిబండి వసుంధర, పృద్వీకృష్ణారెడ్డి నిల్వస్థలము హద్దు,71 లింకులు, **పడమర:** శ్యామల రంగారెడ్డి, ఈదా సంజీవరెడ్డి గారల ఆస్తి హద్దు, 156 లింకులు, **ఉత్తరం:** పంచాయితీ బజారు హద్దు, 71 1/2 లింకులు.

కె. ప్రమీల, అడ్వకేట్
చంద్రమౌళీనగర్, గుంటూరు. సెల్: 9985037449
గుంటూరు తేది: 26-05-2025

ప్రతి అర్జీని పరిశీలించి.. పరిష్కరించండి: పెమ్మసాని

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎక్కువగా భూ సమస్యలు, స్థానిక సమస్యలు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సంబంధించి అర్జీలు అందిస్తారని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పెమ్మసాని చంద్రశేఖర్, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, స్టెఫ్ సీఈఓ ఆర్.చంద్రముని, ఆర్డీఓ శ్రీనివాసరావు ప్రజల నుంచి 222 అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్నదన్నారు. ఎక్కువగా భూ సమస్యలకు సంబంధించిన పిర్యాదులు వస్తున్నాయని, గ్రీవెన్స్‌కు వచ్చిన పిర్యాదులు అన్నింటిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. మరొకసారి కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు.

అర్జీదారులను మళ్ళీ మళ్ళీ కార్యాలయాలకు తిప్పించుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన స్వేచ్ఛను ఉపయోగించుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజల్లో సంతృప్తి శాతం తక్కువగా ఉందని, దానిని పెంచేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జ్యోతిబసు, డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు శంకర్, విజయలక్ష్మీ, ప్రసాద్, డీపీఓ బీవీ నాగ సాయి కుమార్, ఎస్ఈ పంచాయితీ రాజ్ బ్రహ్మయ్య, డీఎస్‌డబ్ల్యూ ఎస్.మోహన్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవీంద్ర, సీపీఓ శేషశ్రీ, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాల్లో ప్రజలను భాగస్వాములు చేయాలి: జంగాల

విశాలాంధ్ర-మంగళగిరి : ప్రజా సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాడుతూ ఉంటుందని, ఆయా ప్రజా ఉద్యమాలలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. మంగళగిరి పట్టణంలోని పాత మంగళగిరి సీపీఐ శాఖ మహాసభ ఆదివారం రాత్రి జరిగింది. ఈ మహాసభకు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారీ వ్యవస్థను పెంచి పోషిస్తూ తన స్వలాభం చూసుకుంటుందని మండిపడ్డారు. కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సైతం మోదీ నాలుగు కోడ్‌లుగా చేసి దానిని అమలు పరచటానికి ప్రయత్నాలు చేస్తున్నాడని, ఆ ప్రయత్నాలను కార్మికులంతా మరో విప్లవాత్మకమైన పోరాటానికి సిద్ధమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 8

గంటల పనిదినాలు 12 గంటలకు పెంచుతూ మోదీ కార్మికుల శ్రమ దోపిడీ చేసే విధంగా చట్టాన్ని తీసుకువచ్చారని విమర్శించారు. సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మేడా హనుమంతరావు, ఆకిటి అరుణ్ కుమార్, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని వారు అన్నారు. రైతులను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తుందని, భారతదేశంలో అతి పెద్ద రంగమైన వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకున్నట్టుగా రైతుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా బ్రిటీష్ కాలం నుంచి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను సైతం వారి పెట్టుబడిదారులు, కార్పొరేట్ అనుకూల శక్తులైన అదాని, అంబానీలకు కార్మికుల శ్రమను దోచిపెడుతుందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్, నిత్యవసర వస్తువుల ధరలు పెంచి సామాన్య ప్రజలపై పెనుభారాలు మోపుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా మృతవీరులకు సంతాపం తెలియజేశారు.

పాత మంగళగిరి సీపీఐ శాఖ నూతన కమిటీ ఎన్నిక: సమావేశం అనంతరం పాత మంగళగిరి నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా నందం హరికృష్ణ(చిన్న), సహాయ కార్యదర్శిగా మల్లూరు వాసు, వీరితోపాటుగా 9 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ మహాసభలో కాటాబత్తుల శేషగిరి, దోనేపూడి సూరిబాబు, కారంపూడి శ్రీనివాసరావు, దోనేపూడి పద్మ, షేక్ మస్తాన్, బుస్స బ్రహ్మం, ఉద్దంటే శ్రీనివాసరావు, ఆకురాతి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు, పరికరాలు ఇవ్వాలి: రైతు సంఘం వినతి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి మరికొన్ని రోజులు మాత్రమే ఉన్న నేపథ్యంలో రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి, పచ్చల శివాజీ, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంజుల విఠల్‌రెడ్డి, పీవీ జగన్నాధం, నాయకులు ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గుంటూరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికీ కూడా విత్తనాల పంపిణీ, కౌలు రైతుల గుర్తింపు, గ్రామసభల నిర్వహణ వంటి కీలక ప్రక్రియలు చేపట్టలేదని అన్నారు. జిల్లాలో ఎక్కువ శాతం కౌలు రైతులే వ్యవసాయం చేస్తున్నా వారికి గుర్తింపు కార్డులు జారీ చేయకపోవడం, సబ్సిడీ విత్తనాలు అందుబాటులో లేకపోవడం వల్ల పంటల సాగుకు అంతరాయం ఏర్పడే పరిస్థితి నెలకొందని అన్నారు. ఇదే సమయంలో విత్తనాల ధరలు భారీగా పెరిగినట్టు, నాసిరకం విత్తనాల వ్యాప్తి పెరిగినట్టు రైతులు తెలుపుతున్నారన్నారు. గత ఏడాది కల్తీ విత్తనాల కారణంగా రైతులు నష్టపోయిన ఘటనలు మర్చిపోకముందే ఈ ఏడాది కూడా అదే పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన

వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అన్ని రకాల విత్తనాలు 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలని, పచ్చిరొట్ట విత్తనాలు, సూక్ష్మ పోషకాలను ఉచితంగా అందించాలని, అన్నదాత సుఖీభవ పధకాన్ని కౌలు రైతులకు వర్తింపజేయాలని, రూ.2 లక్షల వరకు హామీలేని పంట రుణాలు అందించాలని, వ్యవసాయ పరికరాలు పూర్తి సబ్సిడీతో ఇవ్వాలని, కాల్వల పూడికతీత, తూటికాడలు తొలగింపు, గేట్ల మరమ్మతులు చేయాలని, కౌలు రైతులకు గ్రామ సభల ద్వారానే గుర్తింపు కార్డులు జారీ చేయాలని, కల్తీ, నాసిరకం విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించకుంటే ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

మహానాడుకు 'డేగల' రూ.10 లక్షల విరాళం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కడపలో జరుగుతున్న టీడీపీ పసుపు పండుగ మహానాడు-2025కి ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ రూ.10 లక్షలు విరాలాన్ని చెక్కు రూపంలో టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం అందచేశారు. ఈ సందర్భంగా ఏపీ ఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం తర్వాత కడపలో మహానాడు నిర్వహించడం ఇదే మొదటిసారని, కడప గడ్డపై మొదటిసారిగా జరుగుతున్న టీడీపీ మహానాడును చరిత్రలో నిలిచిపోయేలా జరుగుతుందన్నారు. కడప జిల్లాలో నిర్వహించనున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్తకు ఇది గర్వకారణమైన మహానాడు కావాలని, రాష్ట్ర నలుమూలల నుండి కడప వచ్చే వారికి వసతి, భోజన ఏర్పాటులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

ప్రజల హృదయాల్లో మాదల రంగారావు చిరస్మరణీయులు

విశాలాంధ్ర-తెనాలి : సమసమాజ స్థాపన కావాలని పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొని ప్రజా చైతన్య చిత్రాలను నిర్మించిన విప్లవ నటుడు, నిర్మాత మాదల రంగారావు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయనకు కళాకారులు, రచయితలు నివాళులర్పించారు. తెనాలి గాంధీనగర్ ఇస్కఫ్ సమావేశ హాలులో తెనాలి అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో సోమవారం ఆయ సంస్మరణ సభ జరిగింది. సభకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు నీలాంబ్రం అధ్యక్షత వహించారు. కొల్లిపర మండల సిపిఐ కార్యాదర్శి బాలస్వామి మాట్లాడుతూ రంగారావు జీవిత విశేషాలను వివరించారు. ఆయన నిర్మించిన చిత్రాలన్నీ కమ్యూనిస్టు భావాలకు అనుగుణంగా సాగి ప్రజల్లో విప్లవ జ్వాలలు వెల్లివిరిశాయన్నారు. సినిమా రంగానికి రాక ముందు ఆయన ప్రకాశం జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా ఎన్నో ప్రజా హిత కార్యక్రమాల్లో పాల్గొన్నారని చెప్పారు. ప్రజా నాట్యమండలి ద్వారా గ్రామ గ్రామానా రంగారావు డైరెక్టర్ శ్రీకృష్ణ తదితరులు, నల్లూరి వెంకటేశ్వర్లు దర్శకత్వంలో వందలాది ప్రదర్శనలిచ్చారని చెప్పారు. అధ్యక్షత వహించిన నీలాంబ్రం మాట్లాడుతూ మాదల రంగారావు నిర్మించిన ప్రతి సినిమా అభ్యుదయ భావాలకు అనుగుణంగా సాగాయన్నారు. సాంస్కృతిక

ఉద్యమాలకు రంగారావు నిరంతరం కృషి చేశారని చెప్పారు. ప్రజా కళలను బతికించడానికి సినిమా రంగంలో ఉన్నా జీవితాంతం నిరంతర కృషి చేశారని చెప్పారు. మాదల రంగారావు నిర్మించిన ప్రతి చిత్రం ప్రజలకు సందేశం అందించి గొప్ప విజయాలను సాధించాయని చెప్పారు. విప్లవ శంఖం, ఎర్రమల్లెలు, యువతరం కదిలింది వంటి ఎన్నో చిత్రాలు ప్రజలు నేటికి జ్ఞాపకం ఉంచుకున్నారని చెప్పారు. వామపక్ష పార్టీలకు విరాళాలు ఇచ్చి ప్రోత్సహించారని చెప్పారు. బొల్లిముంత శివరామకృష్ణ రచించిన "ధర్మ సంస్థాపనార్ధాయా సంభవామి యుగే యుగే" నాటికను అలనాడు నల్లూరి దర్శకత్వంలో వందలాది ప్రదర్శనలిచ్చిన ఘనత ఆయనకే చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు పరచూరి వెంకటేశ్వరరావు, బొల్లిముంత కృష్ణ, విజయలక్ష్మి, సావిత్రి, బి.వీరయ్య తదితరులు పాల్గొన్నారు. సభా ప్రారంభంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

నేటి ర్యాలీని విజయవంతం చేయండి: కమిషనర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న ఉదయం 7 గంటలకు బృందావన్ గార్డెన్స్ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం నుంచి లక్ష్మీపురం మధర్ థెరిస్సా విగ్రహం వరకు ర్యాలీ జరగుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీలో జిల్లా కలెక్టర్, అధికారులు పాల్గొంటారన్నారు. నగరంలోని యువత, సీనియర్ సిటిజన్స్, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొని విజయవంతం చేయాలని కమిషనర్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర 2025లో నగర ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనెలా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

Jocil Limited (A Subsidiary of The Andhra Sugars Limited)
CIN : L28990AP1978PLC002260
Factory & Regd. Office : DOKIPARRU, GUNTUR - 522 438, A.P.
Ph: 98481 39135 • Email : jocil@jocil.net • Web : www.jocil.in

STATEMENT OF STANDALONE AUDITED FINANCIAL RESULTS FOR THE QUARTER AND YEAR ENDED 31-03-2025
(As per Reg.33 read with Reg 47(1) of SEBI (LODR) Regulations, 2015)

The Board of Directors of the Company, at its meeting held on May 26, 2025, approved the Audited Financial Results of the Company, for the Quarter and Year ended March 31, 2025.

The results along with the Audit Report given by the Statutory Auditors, has been posted on the Company's website at https://www.jocil.in/Outcome26052025.pdf and can also be accessed by scanning the QR Code.

For and on behalf of the Board of Directors
J. MURALI MOHAN
Managing Director
DIN :00114341

Place : Dokiparru
Date : 26-05-2025

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయుట ఏమనగా - నా క్లయింటు దిగువ షెడ్యూలు ఆస్థిని కొనుగోలు చేయుటకు సమ్మతించి ఆస్థి హక్కుదారుడైన **అయిమాల వురఫ్ ఐమాల మోహన్, తండ్రి వెంకట అచ్చయ్య** వద్ద నుండి విక్రయ అగ్రిమెంటు పొందియున్నారు. సదరు ఆస్థికి షెడ్యూలు.

నరసరావుపేట రి.డి. డిటో సబ్. డివిజన్ నరసరావుపేట మండలం, యల్లమంద శివారు గురవాయపాలెం గ్రామం పంచాయతీ **ది.30-11-2022 నాడు** రిజిస్ట్రేషన్ దస్తావేజులోని 1వ పుస్తకం **ద. నెం. 28744/2022** నాడు **అయిమాల వురఫ్ ఐమాల మోహన్** వాటాకు రాబడిన **ఖాతా నెం. 7165** పాసుపుస్తకము గల యల్లమంద గ్రామ **డి. నెం. 332 - ఎ2సిరు య. 0.85 సెంట్లులోని య. 0.28 సెంట్లు** భూమికి విక్రయ రిజిస్ట్రేషన్ **హద్దులు: తూర్పు :** కోటప్పకొండ వెళ్ళు రోడ్డు, **దక్షిణం :** షేక్ జిలాని గారి భూమి హద్దు, **పడమర :** యన్.యస్.పి. కాలువ హద్దు, **ఉత్తరం :** అయిమాల మరియదాసు భూమి హద్దు.

కావున ఎవరికైనా అభ్యంతరము ఉన్న యెడల క్రింది అడ్వకేటు 30 రోజుల లోపు తెలుపుకొనవలెను. తరువాత వచ్చు క్రిమినల్ సివిల్ కేసులకు మేము బాధ్యులము కాము.

శ్రీమతి నసీమా బేగం, M.A.,M.Ed., LL.B.
శ్రీమతి హిమాంబి, B.Com. LL.B.,
అడ్వకేట్స్,
సెల్: 9849250395, 9000433405

టీడీపీలోకి ఎస్సీలు చేరిక

విశాలాంధ్ర – కారం పూడి : మండలం లోని మిరియాల గ్రామానికి చెందిన 20 ఎస్సీ కుటుంబాలు దారెడ్డి ప్రభాకరరెడ్డితో కలిసి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సమక్షంలో సోమ వారం టీడీపీలో చేరారు. వారు మాట్లాడుతూ ఎస్సీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని భావించి చేరమన్నారు. పంగులూరి పుల్లయ్య, బొలినేడి శ్రీను పాల్గొన్నారు.

మహానాడును జయప్రదం చేయండి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-నరసరావుపేట: ఈ నెల 27,28,29 తేదీలలో కడప నగరంలో జరగనున్న మహ టనాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అరవిందబాబు కోరారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ యువనేత లోకేష్ సారధ్యంలో జరుగు తున్న మహానాడు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. పార్టీ శ్రేణులకు స్వయంగా లోకేష్ బాబు దిశా నిర్దేశం చేయనున్నారని అన్నారు. 40 సంవత్సరాల తర్వాత ఈ మహానాడులో లోకేష్ కార్యకర్తలతో ముఖాముఖి మాట్లా డనున్నారని తెలియజేశారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం కొనసాగించవచ్చునని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు, హనుమజ్జయంతి మహోత్సవాల్లో భాగంగా శ్రీనివాసరావుతోటలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం జరిగిన భారీ అన్నదాన కార్యక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గళ్ళా మాధవి మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి దాతలు మరిం తగా ముందుకు రావాలని కోరారు. మహోత్సవాల్లో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు పుప్పాల నాగయ్య, నార దాసు కోటేశ్వరరావు, పత్తి కొండలు, శివ నాగేశ్వరావు, నరసింహారావు, తోట శంకరరావు, రాసంశెట్టి బుజ్జి, ఆళ్ళ హరి, రాజేశ్వరి, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ల రాఘవయ్య విగ్రహ ఏర్పాటుకు నిర్ణయం

విశాలాంధ్ర-పెదనందిపాడు : మండల పరిధిలోని నాగులపాడు గ్రామానికి 37ఏళ్ల పాటు సర్పంచ్‌గా సేవలందించి గ్రామాభివృద్ధికి విశేష కృషిచేసిన ఆళ్ళ రాఘవయ్య విగ్రహాన్ని నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహం పక్కన ఏర్పాటు చేయాలని సోమవారం సాయంత్రం స్థానిక బొడ్రాయి వద్ద నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో రాఘవయ్య కుటుంబసభ్యులు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: విద్యావేత్త, బ్రహ్మ రుషి, సామాజిక సుధారకుడు అయిన రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతిని పురస్కరించుకుని తెలగ అభ్యుదయ సంఘం నాయకులు సోమవారం స్థానిక కాపు హాస్టల్ నందు వెంకటరత్నం చిత్రపటానికి నివాళులు అర్పిం చారు. వారు మాట్లాడుతూ రఘుపతి మహిళా విద్యను ప్రోత్సహించడంలో ప్రముఖ పాత్ర వహించారన్నారు. కుల, మత భేదాలకతీతంగా విద్య అందాలనే దృఢ నిశ్చయంతో గొప్పతనాన్ని చాటారన్నారు. కాపు నాయ కులు బాలిశెట్టి విజయ కుమార్, దెగల వెంకటేశ్వరరావు, పూరిబండి శ్రీకాంత్, కూటాల కృష్ణ, ఊరుబండి కృష్ణ మూర్తి,శ్రీగిరి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలెక్కడా?: సీపీఐ

విశాలాంధ్ర-దుగ్గిరాల : కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అయిన కూడా సూపర్ సిక్స్ అమలు చేయడం లేదని మంగళగిరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అన్నారు. ఈమని గ్రామంలో సీపీఐ నాయకులు అమర్తులూరి ముత్తారావు అధ్యక్షతన గ్రామ శాఖ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ పతా కాన్ని ఎగురవేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన చిన్ని తిరుపతయ్య మాట్లా డుతూ ప్రభుత్వం ప్రజలకు చేసిన వాగ్దానాలు నెరవేర్చడం లేదని విమ ర్శించారు. పేదలకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారికి ఇచ్చిన హామీలను నెర వేర్చి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవా లని కోరారు. ఈ సమావేశంలో మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మహిళా సమాఖ్య గుంటూరు జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, దుగ్గిరాల కమ్యూనిస్టు పార్టీ నాయకులు యార్లగడ్డ శివయ్య పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక: సమావేశం అనంతరం ఈమని గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా అమర్తులూరి ముత్తారావు, సభ్యులుగా కంచర్ల విజయమ్మ, పోకూరి మరిదాస్, బురదగుంట మరియమ్మ, తలతోటి మరియమ్మలను ఎన్నుకున్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు ఉద్యమాన్ని కొనసాగిద్దాం

ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకుల ధర్నా

విశాలాంధ్ర-నరసరావుపేట: స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు మోదీ ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నాలను ముమ్మరం చేస్తుందని, అందులో భాగంగా ప్రైవేట్ పెట్టుబడిదారులు కోరినట్టుగా ఇక్కడి కార్మికుల సంఖ్యను తగ్గిస్తోందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.ఆంజనేయులు చెప్పారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా విశాఖపట్టణం స్టీల్ ప్లాంట్‌ని ప్రైవేటీకరణకు నిలుపుదల చేయాలని తొలగిం చిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, గనులు కేటా యించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటివరకు వెయ్యి మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీన్ని ప్రశ్నిస్తున్న నాయకులకు యాజమాన్యం షోకాజ్ నోటీసులను జారీ చేయడం దుర్మార్గమన్నారు. అనంతరం కలెక్టర్ పి.అరుణ్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగ య్య, సత్యనారాయణ రాజు, జమ్మలమూడి వెంకటేశ్వర్లు, రోడ్డ అంజిరెడ్డి, అబ్రహం, శ్రీనివాస్ రెడ్డి, సిఐటియు నాయకులు ఎన్ కే సిలారు, రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు నిర్వహించండి

విశాలాంధ్ర - కారంపూడి : వేపకం పల్లి నాగులేరు బ్రిడ్జి ప్రక్కన ఉన్న సిమెంట్ రోడ్డును బాగు చేయాలని కారంపూడి మండల సీపీఐ కార్యదర్శి షేక్ సైదా డిమాండ్ చేశారు. పార్టీ కారంపూడి మండలం వేపకం పల్లి గ్రామ శాఖ మహా సభను సోమవారం నిర్వహించు కున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల కార్యదర్శి వేపకం పల్లిలో పలు సమస్యలను ప్రస్తావిస్తూ నాగులేరు బ్రిడ్జి ప్రక్కన ఉన్న సిమెంట్ రోడ్డు పెచ్చులూడి అధ్వాంనంగా తయారైందని పాదాచార్లకు అలాగే వాహనదారులకు చాలా ఇబ్బందిగా ఉంది కాబట్టి తక్షణమే దానిని మరమ్మతులు చేయవలసిందిగా ఆయన డిమాండ్ చేశారు. అనంతరం శాఖా కార్యదర్శిగా షేక్ చిన్న సైదులు, సహాయ కార్యదర్శిగా చాంద్బాషాలను ఐదుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో షేక్ వలి, సైదులు, సైజాను, మౌలాలి, నాగూరు, బ్రహ్మయ్య, నాసర్వలి మొదలగు వారు పాల్గొన్నారు.

స్థలాన్ని బదలాయించండి: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు వెల్ఫేర్ సెంటర్ స్థలంలో గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాలకు కేటాయించిన ఆరు ఎకరాలు స్థలం పోగా మిగిలిన స్థలాన్ని గుంటూరు నగరపాలక సంస్థకు బదలాయింపు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. ఈ మేరకు స్థానిక అరండల్‌పేటలోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ లక్ష్మీను ఆమె కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ గుంటూరు ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ 2025 మార్చి 15న వెల్ఫేర్ సెంటర్‌ను సందర్శించడం జరిగిందన్నారు. అదేవిధంగా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించిన ఆరు ఎకరాలలో ఆసుపత్రి కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, ఆ సమయంలో మిగిలిన స్థలాన్ని నగరపాలక సంస్థకు బదలాయింపు చేయాలని కార్మిక శాఖకు తెలియజేయడం జరిగిందన్నారు. కానీ ఇప్పటివరకు స్థలం బదలాయింపు జరుగలేదన్నారు. తక్షణమే కార్మిక శాఖ అధికారులు స్పందించి స్థలం బదలాయింపు ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనివలన ప్రజాప్రయోజనార్థం ఈ స్థలం వాడుకలోకి వస్తుందని, అలాగే వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి మార్గం సుగమం అవుతుందని చెప్పారు. దీనికి తమ సహకారాన్ని అందించా లని అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌ను మాల్యాద్రి కోరారు. తగు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చినట్లు కోట మాల్యాద్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు మామిళ్లపల్లి సుబ్బరాయుడు, మేడసాని కేశవరావు, దూదిపల్లి శీను, కోట అశ్వనికుమార్, కల్లూరి తిరుపతయ్య, కోట గోపాల్, దుగ్గినేని వెంకట కృష్ణయ్య, నాగేశ్వరరావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పని చేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు.

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహిం చిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. డీఆర్ఓ, అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ త్వరితగతి న పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

నేడు రైతుల నిరసన దీక్ష

విశాలాంధ్ర-చిలకలూరిపేట: నల్లబర్లీ పొగాకును వెంటనే కొనుగోలు చేయాలని మంగళవారం ఉదయం 10 గంటలకు ఐటీసీ కంపెనీ వద్ద రైతుల నిరసన దీక్ష నిర్వహిస్తున్నట్లు రైతు సంఘాల సమన్వయ సమితి సభ్యులు తెలిపారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సమ క్షంలో పొగాకు కంపెనీలు అంగీకరించిన విధంగా కొనుగోళ్లు చేయకపోవడంతో ఈ దీక్ష చేపట్టినట్లు వెల్లడించారు. క్వింటా ఒక్కింటికి గత ఏడాది కన్న రూ.15వేలకు తక్కువ కాకుండా బర్లీ పొగాకు కంపెనీల తో ప్రభుత్వం కొనిపించాలన్నారు. పొగాకు కంపెనీలు న్యాయమైన ధరకు కొనుగోలు చేయకపోతే మార్కెఫెడ్ సంస్థ ద్వారా కొని రైతులను ఆదుకోవాలన్నారు.

పొగాకు బోర్డు పరిధిలోకి బర్లీ పొగాకును చేర్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం పొగాకు కంపెనీలకు పెద్దన్నగా వ్యవహరిస్తున్న ఐటీసీ కంపెనీ ముందు నిర్వహిస్తున్న నిరసన దీక్షలో రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజలు, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఫిర్యాదులు 48 గంటల్లో పరిష్కరించాలి: మేయర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : క్లీన్ అండ్ గ్రీన్ గుంటూరు నగరం కోసం నగరంలో వార్డుల వారీగా చేపట్టిన మెగా క్లీనింగ్ కార్య క్రమంలో గుర్తించిన ప్రజల ఫిర్యాదులను 48 గంటల్లోగా పరిష్కరించాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర అధికారులను ఆదేశించారు. నగరంలోని 21వ వార్డు భాను ప్రసాద్ కాలనీ, శశాంక్ గోయల్ కాలనీ, కేవీపీ కాలనీ మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి సోమవారం మేయర్ పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మెగా క్లీన్ కార్యక్రమం ద్వారా వార్డులలో సుదీర్ఘకాలం నుంచి ఉన్న పారిశుధ్యం, డ్రైన్ల సమస్యలను ప్రత్యేక దృష్టితో పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కేవీపీ కాలనీ మెయిన్ రోడ్ వీబీపీలు నిత్యం రాకపోకలు చేస్తుంటారని, సదరు రోడ్, మెయిన్ డ్రైన్ ఆక్రమణలతో నిండిపోయిందన్నారు. సదరు ఆక్రమణలను 2 రోజుల్లో తొలగించాలన్నారు. డ్రైన్లలో తీసిన పూడికను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. క్షేత్ర స్థాయిలో సచివాలయ కార్యదర్శులు చిత్తశుద్ధితో ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. కమిషనర్ మాట్లాడుతూ వార్డులో సాధారణంగా విధులు నిర్వహించే కార్మికులతో పాటు అదనంగా కార్మికులతో ప్రతి వీధిని, డ్రైన్లను శుభ్రం చేయడం, అనధికార హోర్డింగ్స్, బోర్డులు ఉంటే తొలగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్ డాక్టర్ అమృతం, డిప్యూటీ సిటి ప్లానర్ సూరజ్ కుమార్, డీఈఈ మధుసూదన్, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, బయాలజిస్ట్ రామారావు, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, కంద్రగుంట గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

మంగళవారం 27 మే । 2025

ఇసుకను స్టాక్ పాయింట్లలో నిల్వ చేసేలా చర్యలు : ఇన్చార్జి కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జిల్లాలో వర్షాకాలంలో ఇసుక సరఫరాకు ఇబ్బందులు లేకుండా ముందస్తుగా అవసరమైన ఇసుకను స్టాక్ పాయింట్లలో నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఏ భార్గవ్ తేజ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని డిఆర్సి సమావేశ మందిరంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ అధ్యక్షతన జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఎజెండా అంశాలకు సంబంధించి ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నుంచి వైకుంఠపురం వరకు నావిగేషన్ ఛానల్ 4 లో ఇసుక త్రవ్వకాలకు సంబంధించి సర్వే పూర్తి అయిన వెంటనే పెనుమాక, రాయపూడి, వెంకటాయపాలెం, లింగాయపాలెం, బోరుపాలెం, అబ్బురాజుపాలెంలో ఇసుక పూడికతీతకు బోట్స్ మెన్ సొసైటీకి కేటాయింపుపై సాంకేతిక నివేదికను వారంలో అందించాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. లింగాయపాలెం స్టాక్ పాయింట్ ను నిర్వహించిన స్వయం సహాయక సంఘాలకు పెండింగ్‌లో ఉన్న ఇసుక లిఫ్టింగ్ చార్జీలను తహశీల్దారు నుంచి నివేదిక అందించిన వెంటనే మంజూరు చేయాలన్నారు. పట్టా భూముల్లో ఇసుక త్రవ్వకాలకు అవసరమైన అనుమతులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో జిల్లా అవసరాలకు అనుగుణంగా స్టాక్ యార్డులలో ఇసుక నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కే.ఖాజావలి, జిల్లా మైన్స్ జియాలజీ అధికారి డి వెంకట సాయి, గుంటూరు ఆర్‌టిఓ శ్రీహరి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఐక్యూ నుండి ఐక్యూ నియో10 లాంచ్

విశాలాంధ్ర-గుంటూరు: హై పెర్ఫార్మెన్స్ స్మార్ట్ ఫోన్ బ్రాండ్ ఐక్యూ తన లేటెస్ట్ పవర్ హౌస్ ఐక్యూ నియో 10ను లాంచ్ చేసింది. యువ నిపుణుల నుండి భారీ-పనితీరు వినియోగదారుల వరకు యువత కోసం ఇది రూపొందింది. దాని మార్గదర్శక డ్యూయల్-చిప్ ఆర్కిటెక్చర్, మెరుగైన శీతలీకరణ వ్యవస్థ, మొదటి ఆవిష్కరణలతో ఈ విభాగంలో కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేస్తుంది. ఐక్యూ నియో10 భారతదేశపు మొట్టమొదటి స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ 4 చిప్‌సెట్‌తో వస్తుంది. శక్తివంతమైన 7000 ఎంఏహెచ్ బ్యాటరీని స్లిమ్ డిజైన్‌లో ఏకీకృతం చేస్తుంది. ఐక్యూ నియో10 8ం128జీబీ వేరియంట్ ధర రూ.31,999, 8ం256 వేరియంట్ ధర రూ.33,999, 12ం256జీబీ వేరియంట్ ధర రూ. 35,999, 16ం512జీబీ వేరియంట్ ధర రూ.40,999. ఇది ఇన్ఫెర్నో రెడ్, టైటానియం క్రోమ్ అనే రెండు రంగులలో లభిస్తుంది. అదనంగా, ఐక్యూ నియో 10 సోమవారం నుండి ప్రీ-బుకింగ్ కోసం అందుబాటులో ఉంది. జూన్ 3, మధ్యాహ్నం 12 గంటల నుండి ఐక్యూ ఈస్టోర్, అమెజాన్.ఇన్‌లో అమ్మకం ప్రారంభమవుతుంది. ఐక్యూ నియో 10ను ప్రీ-బుక్ చేసుకునే కస్టమర్లు ఉచిత ఐక్యూ టీడబ్ల్యుఎస్ 1ఈని అందుకుంటారు.

జాస్తికి డాక్టర్ ఎన్టీఆర్ సేవారత్న అవార్డు అందజేత

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అఖిల భారత పంచాయితీ పరిషత్ (న్యూఢిల్లీ)జాతీయ ఉపాధ్య క్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు డాక్టర్ ఎన్టీఆర్ సేవారత్న అవార్డు అందుకున్నారు. 'గుంటూరు అన్నదాన సత్రంలో డాక్టర్ ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్, స్వరాలాపన అధ్యక్షులు, విశ్రాంత టుబాకో బోర్డు అధికారి దేవరకొండ బాలస్వామి, ప్రధాన కార్యదర్శి కంబాల బాబురావుల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)చైర్మన్ వడ్రాణం హరిబాబు ఈ అవార్డును అందజేశారు. అనంతరం వడ్రాణం హరిబాబు మెమంటోను జాస్తికి అందజేశారు. జాస్తి వీరాంజనేయులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో చేసిన సామాజిక సేవలను హరిబాబు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత చిరంజీవి యువత అధ్యక్షులు మేకల రవీంద్రబాబు, గాయకుడు రాము, జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా నాయకులు మిరియాల ప్రసాదరావు, మిరియాల గోపికుమార్, గాదే రత్నారెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ అదనపు సంచాలకులు రాసంశెట్టి నరసింహారావు, కంబాల బాబురావు, అబ్దుల్ ఖాదర్, కొల్లూరు శివ ప్రసాద్, బీఎస్ పోతురాజు, జమదగ్ని, రవికాంత్, సుధీర్, బిళ్ళా అశోక్, తదితరులు పాల్గొని జాస్తి వీరాంజనేయులుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రైస్తవ సమాధి తోటలకు స్థలాల విషయమై.. ప్రభుత్వం నివేదిక కోరిన లేఖ ఇన్చార్జి కలెక్టర్‌కు అందజేత

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: గుంటూరు నగరంలో నాలుగు మూలల క్రైస్తవ సమాధి తోటలకు స్థలాలు కేటాయించాలని సామాజిక వేత్త, ఐక్య వ్యవస్థాపకులు డాక్టర్ గోళ్ళమూడి రాజా సుందర్ బాబు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ కు నగరంలో 4 క్రైస్తవ సమాధి తోటలకు స్థలాల విషయమై ప్రభుత్వం నివేదిక కోరిన లేఖను క్రైస్తవ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా రాజా సుందర్ బాబు మాట్లాడుతూ గత ఐదు ఏళ్ళుగా గుంటూరు నగరంలో అన్ని చర్చిలకు సంబంధించిన క్రైస్తవ సమాధుల్లో, సమాధులన్నీ మృతదేహాలతో నిండిపోయాయని, మృతదేహాలను ఖననం చేసేందుకు అంగుళం భూమి కూడా లేదన్నారు. స్థలాలు లేక ఇబ్బంది పడుతున్న వైనాన్ని, క్రైస్తవ సంస్థలు ఈనెల 6వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (మైనార్టీ సంక్షేమ శాఖ) నీ కలిసి వినతిపత్రం సమర్పించడం జరిగిందని తెలియజేశారు. దరిమిలా, రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21వ తేదీన జిల్లా కలెక్టర్‌కి నివేదికను పంపవలసిందిగా ఆదేశాలు ఇచ్చిందని, ప్రభుత్వ ఆదేశాలను సమర్పించడం జరిగిందని తెలియజేశారు. త్వరితగతిన సర్వే జరిపి, నివేదికను ప్రభుత్వానికి పంపే ఏర్పాటు చేయాలని కోరారు. అదే సమయంలో కలెక్టరేట్‌కు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ని కూడా కలిసి క్రైస్తవుల సమాధి తోటల స్థలాల సమస్యను ఆయన దృష్టికి తీసుకుని వచ్చి న్యాయం చేయాల్సిందిగా రాజా సుందర్ బాబు కోరారు. సమస్యపై దృష్టి పెడతానని ఈ సందర్భంగా పెమ్మసాని వారికి హామీనిచ్చారు. ఇన్చార్జ్ కలెక్టర్‌ని కలిసిన వారిలో డాక్టర్ గోళ్ళమూడితో పాటు, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మద్దు ప్రేమ జ్యోతి బాబు, క్రైస్తవ నాయకులు ఎస్ శరత్ బాబు, బడుగు రత్నకుమార్, పాస్టర్ చింతా బత్తిని బాబురావు, ఆగనాటి ఆంటోనీ, ఏఐసివైఏ నాయకులు గడ్డం సురేష్ తదితరులు ఉన్నారు.

అనూష మరణంపై విచారణ జరిపించాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: రజక మహిళ తొరటి అనూష (32) అనుమాస్పద స్థితిలో మరణించిన విషయంపై ఆమె భర్త పార్థసారధి, ఆమెకు చికిత్స చేసిన డాక్టర్‌పై కేసు నమోదు చేసి, విచారించి, న్యాయం చేయాలని కోరుతూ రజకవృత్తి ధోబీ ఘాట్ల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు చెన్నూరి చెన్నయ్య సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ స్థానిక గుంటూరువారి తోట నందు నివాసం ఉంటున్న కొరటి సామ్రాజ్యం, సాంబశివరావుల కుమార్తె అయిన తొరటి అనూషాకు గుంటూరు నగర గోరంట్ల వాస్తవ్యులైన పురుషోత్తపట్టణం పార్థసారధి అను వ్యక్తికి ఇచ్చి 2018లో వివాహం జరిపించారు. వారిద్దరూ వృత్తి రీత్యా చెన్నై సిటీలో నివసిస్తున్నారన్నారు. ఆమె గర్భవతి కాగా చెన్నైలోని ఓ డాక్టర్ వద్ద వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఉన్నది. ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ మీ ఆరోగ్యం బాగా లేదు, ప్రయాణం చేయరాదు, ఉద్యోగానికి సెలవు పెట్టి విశ్రాంతి తీసుకోవాలి అని సూచించినప్పటికీ ఆమె భర్త ఉద్యోగం చేయిస్తూ, తరువాత అనూషాను కాన్పు నిమిత్తం గుంటూరులోని ఆమె తల్లిదండ్రుల వద్దకు తెచ్చి దించినాడు. గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారన్నారు. తల్లి, బిడ్డ చాలా ప్రమాద పరిస్థితులలో ఉన్నారని, ఆమె భర్తకు తెలిపినా, ఆ విషయాన్ని ఆ అమ్మాయి కుటుంబ సభ్యులకు చెప్పకుండా గుంటూరులోని ఆసుపత్రిలో వైద్యం కొనసాగించినాడని తెలిపారు. ఏప్రిల్ 12, 2025 బాధిత మహిళకు పురిటి నొప్పులు రాగా డాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మొదట బిడ్డ, తరువాత తల్లి ఇద్దరూ మరణించిందని తెలిపారు. పార్థసారధి, వైద్యం చేసిన డాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఈనెల 20వ తేదీన కలెక్టరు కార్యాలయానికి వస్తే అక్కడ కూడా ఆమె భర్త, ఆ అమ్మాయి కుటుంబ సభ్యులను బెదిరించినట్టు తెలిపారు. అనూష మరణంపై విచారణ జరిపించి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

రూ.14 లక్షల విలువైన టాటా ఏస్, 8 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

విశాలాంధ్ర-మంగళగిరి : వాహనాలు, మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను చాకచక్యంగా మంగళగిరి గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్ అదుపులోకి తీసుకున్నారు.

గుంటూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ, గ్రామీణ సీఐ ఉత్తర్వులు మేరకు దర్యాప్తులో పోలీస్ సిబ్బందిని ఆయా ప్రాంతాలలో పెట్టడం వారిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. సోమవారం మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సీఐ వై.శ్రీనివాసరావు, ఎస్సై చిరుమామిళ్ల వెంకట్‌లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో సినీపక్కిలో

ద్విచక్ర మోటారు వాహనాలు చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ నేరాలకు పాల్పడుతున్న కన్నా గోపి, ఎస్‌కే సర్దార్‌లను అదుపులోకి తీసుకొని సుమారుగా రూ.14 లక్షల విలువైన టాటా ఏస్, 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా ఈ నెల 17వ తేదీన పెదవడ్లపూడి గ్రామంలో సెంటర్‌లో పార్కు చేసి ఉన్న టాటా ఏస్ చోరీకి గురైందని వాహనదారుడు మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా జాతీయ రహదారులు, పరిశీలిస్తూ బాపట్లలోని ఒక వైన్ షాపు వద్ద రాబడిన సమాచారం మేరకు నిఘా నేత్రాల ద్వారా ముద్దాయిలను

చాకచక్యంగా పట్టుకొని వారిని అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. ముద్దాయిలను చాకచక్యంగా పట్టుకున్న గ్రామీణ ఎస్సై చిరుమామిళ్ల వెంకట్, గ్రామీణ ఎస్సై మహేష్‌ను పోలీస్ సిబ్బంది ఏఎస్ఐ రత్నరాజు, హెడ్ కానిస్టేబుల్ సిహెచ్ శేఖర్ బాబు, కానిస్టేబుల్ ఎన్.సాగర్ బాబులను జిల్లా ఎస్పీ అభినందించారు.

గుండె జబ్బులుపై అవగాహన ఉండాలి: శివ ప్రసాద్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నేడు ఎక్కువ మంది ఎదుర్కొంటున్న జబ్బులలో గుండె జబ్బులు అధికంగా ఉంటున్నాయని, ఈ నేపధ్యంలో ప్రతి ఒక్కరూ గుండె జబ్బులుపై అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆకుల శివ ప్రసాద్ అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'గుండె జబ్బులు'పై ఆరోగ్య సభ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శివ ప్రసాద్ మాట్లాడుతూ మన శరీరంలో అతి ముఖ్యమైన భాగాలలో ఒకటైన గుండె పని తీరు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఇటీవల కాలంలో చాలా చిన్న వయసు వారు కూడా గుండెపోటుకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. దీనికి అనారోగ్యపు ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడమే కారణమన్నారు. రోజులో కనీసం ఒక గంట వ్యాయామం చేస్తూ మంచి ఆహార అలవాట్లు కలిగి ఉండి, మంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. మన శరీరంలో రక్తాన్ని శుద్ధి చేసే ప్రక్రియను మన మూత్రపిండాలు చేస్తే ఆ పరిశుభ్రమైన రక్తాన్ని మన శరీరంలో వివిధ అవయవాలకు పంపి వాటి పని తీరు ఆరోగ్యంగా ఉంచే పనిని గుండె నిర్వహిస్తుందని, అలాంటి ముఖ్యమైన పని చేసే గుండె ఆరోగ్యాన్ని ఎల్లప్పుడూ బాగుండేలా చూసుకోవాలని సూచించారు. షుగర్ వ్యాధి ఉన్నవారు వారి రక్తంలోని చక్కెర శాతాన్ని అదుపులో ఉంచుకోవాలని, లేకుంటే గుండెకి రక్త సరఫరాలు దెబ్బతిని మిగిలిన అవయవాలకు కూడా సరిపడా రక్త సరఫరా అందక వివిధ అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. రక్తంలో చక్కెర శాతం అదుపులో ఉండని యెడల రక్తనాళాలలో పూడికలు ఏర్పడి గుండెకు రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడి స్టంట్స్ వేయడం లేదా బైపాస్ శస్త్ర చికిత్స చేయవలసిన పరిస్థితి ఏర్పడుతుందని, గుండె ఆరోగ్యాన్ని తెలుసుకోవడానికి ఈసీజీ, 2డీ ఎకో, టీఎంటీ అండ్ ట్రోపమిన్ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటి ద్వారా మన గుండె యొక్క పని తీరు తెలుసుకొని తగు జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. గుండెపోటు వచ్చిన వారిలో నీరసం రావడం, చెమటలు పట్టడం ఎడమ చేయి లాగడం, విరోచనం కావడం, చాతిలో బరువుగా ఉండటం లాంటి లక్షణాలు కనబడతాయని, అలాంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే దగ్గరలో ఉన్న హాస్పటల్‌కి వెళ్లి చికిత్స చేయించుకుంటే మంచిదన్నారు. ఈ ఆరోగ్య సభకు కో-ఆర్డినేటర్‌గా టీ.వీ సాయిరాం వ్యవహరించగా చల్లా అంజిరెడ్డి, డాక్టర్ ఆర్.రామ చంద్రరావు, విద్యావేత్త ఇ.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.